సంపుటి : 18
సంచిక : 117
Vol : 18
Issue : 117



RNI NO: TEL/TEL/2009/28544

తెలంగాణ & ఆంధ్రప్రదేశ్

# పీపుల్స్ డైరీ

సమగ్ర వార్తా దినపత్రిక

విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం

Editor : KONDAPARTHI KIRAN
CELL : 9493019044

వరంగల్, గురువారం 2 జూలై 2026
Warangal, Thursday 2 July 2026

పేజీలు : 08
వెల రూ : 4-00

Pages : 08
Price : 4-00

WANTED
పీపుల్స్ డైరీ
దినపత్రిక తెలంగాణ & ఏపీలోని వివిధ జిల్లాల్లో పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
సెంటర్లు
◆ హనుమకొండ ◆ కరీంనగర్
◆ భూపాలపల్లి ◆ పెద్దపల్లి/రామగుండం
◆ జనగామ ◆ మహబూబాబాద్
◆ హైదరాబాద్ ◆ నిజామాబాద్
Cell : 9493019044
9618509859

## ఉస్మానియ లిఖించిన సరికొత్త చరిత్ర

- వైద్యుల చారిత్రాత్మక విజయం
- రోగికి ఒకేసారి 5 అవయవాల మార్పిడి
- ప్రభుత్వ వైద్య రంగ కీర్తి కిరీటంలో మరో మణిహారం
- 36 గంటల పాటు ఏకధాటిగా శస్త్రచికిత్స
- దేశంలోనే తొలిసారి ఉస్మానియా ఆస్పత్రి ఘనత..

2వ పేజీలో..





## అమల్లోకి నూతన చట్టం

- దశాబ్దాల 'ఉపాధి హామీ' రద్దు..
- దీనిస్థానంలో వీబీ-జీ రాంజీ చట్టం షురూ
- ఇకపై 125 రోజుల పని గ్యారెంటీ!

**పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ :** దేశవ్యాప్తంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను, ఉపాధి రంగాలను సమూలంగా మార్చే దిశగా కేంద్ర ప్రభుత్వం సరికొత్త విప్లవాత్మక చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. దశాబ్దాలుగా అమల్లో ఉన్న 'మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం' జూలై 1తో పూర్తిగా రద్దయింది. దీని స్థానంలో "వికసిత్ భారత్ – గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్)" VB-G RAM G చట్టం బుధవారం దేశవ్యాప్తంగా అధికారికంగా అమలు ప్రారంభమైంది.

గతంలో ఉపాధి హామీ కింద 100 రోజుల పని దినాలు కల్పించగా,


(మిగతా 2లో...)

2వ పేజీలో..

## విద్యాశాఖ మొద్దునిద్ర!

- పట్టించుకోని మండల ద్యాధికారి!
- మామూళ్లు అందుకుంటున్నారా..?
- మండిపడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు
- అక్రమ ఫీజులపై చర్యలు ఎక్కడ?
- అనుమతులు లేని పాఠశాలలు






## ఘాటెక్కిన అల్లం, ఉల్లి





- సామాన్యుడికి చుక్కలు చూపిస్తున్న ధరలు..
- వారం రోజుల్లోనే భారీగా పెరుగుదల
- సరఫరా అంతరాయాల వల్లే ధరలు పైపైకి

**పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ :** తెలంగాణలో నిత్యావసర వస్తువులు, కూరగాయలు, మసాలా దినుసుల ధరలు సామాన్య ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. ముఖ్యంగా వంటల్లో ప్రతిరోజూ ఉపయోగించే అల్లం, ఉల్లిగడ్డల ధరలు వారం రోజుల్లోనే భారీగా పెరిగాయి. మార్కెట్ ఒడిదుడుకులు, అంతరాష్ట్ర సరఫరాలో తలెత్తిన అంతరాయాల కారణంగా వీటి ధరలు అమాంతం పెరిగాయి. గత వారం రోజుల్లోనే కిలో అల్లం ధరపై దాదాపు రూ. 70 వరకు అదనపు భారం పడింది. కిందటి వారం మార్కెట్లో కిలో అల్లం ధర రూ. 150 పలకగా.. మంగళవారం నాటికి అది ఏకంగా రూ. 220కి చేరుకుంది. కేవలం అల్లం మాత్రమే కాకుండా ఉల్లిపాయలు కూడా అదే

(మిగతా 2లో...)

## తెలంగాణ, కర్ణాటక బోర్డర్‌లో ఉద్రిక్తత
## ముదిరిన చెత్త లొల్లి



**పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ :** తెలంగాణ కర్ణాటక సరిహద్దులో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కర్ణాటకలోని బీదర్ మున్సిపాలిటీ చెత్తను.. తెలంగాణలోని మల్గి గ్రామం సమీపంలో డంప్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ గ్రామస్తులు చేపట్టిన నిరసన బుధవారం తీవ్ర రూపం దాల్చింది. రెండు రాష్ట్రాల సరిహద్దులో ఉదయం నుంచే ఉద్రిక్త వాతావరణం నెలకొనగా.. ఇరు రాష్ట్రాల మధ్య రాకపోకలు గంటల పాటు నిలిచిపోయాయి. చెత్త వాహనాలను గ్రామస్తులు అడ్డుకోవడంతో ఆగ్రహించిన అధికారులు ప్రధాన రహదారిపైనే చెత్త పారబోసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో బీదర్–మల్గి మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఇరు రాష్ట్రాల పోలీసులు, రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని గ్రామస్తులు ఆందోళన కొనసాగిస్తున్నారు.

(మిగతా 2వ పేజీలో...)

## మద్యం మత్తు... కక్కిన అవినీతి గుట్టు

- సహకార సంఘంలో కోటి రూపాయల అవినీతి?
- కార్యాలయం వదిలి పక్క మండలంలో అధికారుల మందు పార్టీ...!
- మత్తులో నిజాలు కక్కిన ముగ్గురు అధికారులు!
- రైతుల పేరుతో మొక్కజొన్నల కొనుగోలు కుంభకోణమా...?
- మొత్తం వ్యవహారం వెనుక ఆ 'బడా బాబు' హస్తం?



2వ పేజీలో..

## నిర్లక్ష్యాన్ని ఊడ్చేయండి

ఎముడాల రాజన్న చెంత అపరిశుభ్రత అఘోర నృత్యం

నరకప్రాయంగా మారిన ప్రభుత్వ వసతి గృహాలు!

రాజన్న క్షేత్ర మహిమకు పరిమళం తీసుకురండి.

అధికారులను డిమాండ్ చేస్తున్న భక్తులు...

దక్షిణ కాశీ గడప దాటి, దైవ దర్శనం కోరి వచ్చిన భక్తుడు... దేవుడి దయ కంటే ముందుగా దుర్వాసనే దర్శనం ఇస్తుంటే.. ఆ పవిత్రత అర్థం ఏముంది? రాజన్న నామం జపించే పెదవులకు చెత్త గుట్టలే స్వాగతం పలుకుతుంటే, పుణ్యక్షేత్రం పరిమళించాల్సిన చోట అపరిశుభ్రతే అఘోర నృత్యం చేస్తోంది. ముక్కు మూసుకుని నడిచే భక్తుడి కన్నీరు దేవుడి గర్భగుడి చేరకముందే ఈ నిర్లక్ష్య గోడలకే తాకి నిశ్శబ్దంగా జారిపోతోంది. దేవాలయం సంపద కోట్లలో పెరుగుతోంది... భక్తుల కష్టాలు మాత్రం రోజురోజుకూ పేరుకుపోతున్నాయి. దోమల గానం, ఈగల సందడి మధ్య భక్తి కూడా తలదించుకుంటోంది....

పీపుల్స్‌డైరీ-వేములవాడ



2వ పేజీలో..

పీపుల్స్‌డైరీ
వరంగల్
గురువారం, 2 జూలై 2026
సంపుటి : 18, సంచిక : 117


# విద్యాశాఖ మొద్దునిద్ర!

» పట్టించుకోని మండల విద్యాధికారి!
» మామూళ్లు అందుకుంటున్నారా..?
» మండిపడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

■ రిజిస్ట్రేషన్ ఆక్స్ఫర్డ్ హైస్కూల్.. సదాశివ గ్రూప్స్ ఆడ్ చేశారు
■ లక్ష్మమ్మ స్కూల్ పేరుతో ఉన్న రిజిస్ట్రేషన్ బిల్డింగును సాధన స్కూల్ గా మార్చారు
■ నారాయణ స్కూల్ కి పర్మిషన్ లేదు
■ మేడ్చల్లో సగం పాఠశాలలకు ఆట స్థలాలు ఫైర్ సేఫ్టీ సరైన వసతులు లేవు
■ పుస్తకాలు విక్రయిస్తున్న చూసి చూడనట్టు వ్యవహరిస్తున్న విద్యాశాఖ

**మేడ్చల్, జూన్ 29 (పీపుల్స్‌డైరీ) :** మేడ్చల్ మండలంలో ప్రైవేట్ పాఠశాలల అక్రమాలపై విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. అనుమతులు లేకుండా నడుస్తున్న పాఠశాలలు, నిబంధనలకు విరుద్ధంగా "ఇంటర్నేషనల్", "సీబీఎస్ఈ" పేర్లతో ప్రచారం చేస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ, మండల విద్యాధికారి (ఎంఈవో) కార్యాలయం నుంచి ఇప్పటివరకు గట్టి చర్యలు కనిపించడం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు అత్యాధునిక సదుపాయాలు, విశాలమైన ఆటస్థలాలు, నాణ్యమైన విద్య అందిస్తామని భారీ హోర్డింగులు, ప్రకటనలతో విద్యార్థులను ఆకర్షించిన అనేక ప్రైవేట్ పాఠశాలలు, విద్యా సంవత్సరం ప్రారంభమైన తర్వాత కనీస మౌలిక వసతులు కూడా కల్పించడంలో విఫలమయ్యాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆటస్థలాలు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, భద్రతా ప్రమాణాలు వంటి ప్రాథమిక సదుపాయాలు కూడా అనేక పాఠశాలల్లో లేవని తల్లిదండ్రులు చెబుతున్నారు.


యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, ఇతర విద్యా సామగ్రిని పాఠశాలల నుంచే కొనుగోలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నారని, అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపిస్తున్నారు. అయినప్పటికీ ఈ అంశాలపై ఇప్పటివరకు సమగ్ర తనిఖీలు నిర్వహించినట్లు సమాచారం లేదని వారు పేర్కొంటున్నారు.

కొన్ని పాఠశాలలు ఒక పేరుతో రిజిస్ట్రేషన్ పొందినా, మరో పేరుతో నిర్వహించడంతో పాటు సీబీఎస్ఈ లేదా ఇంటర్నేషనల్ పాఠశాలలుగా ప్రచారం చేస్తున్నాయని, సంబంధిత అనుమతులు ఉన్నాయా లేదా అనే విషయాన్ని అధికారులు పరిశీలించడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఈ విద్యా సంవత్సరంలో మేడ్చల్ మండలంలో ఎన్ని ప్రైవేట్ పాఠశాలలను తనిఖీ చేశారు? నిబంధనలు ఉల్లంఘించిన ఎన్ని పాఠశాలలకు నోటీసులు జారీ చేశారు? ఎన్ని పాఠశాలలపై చర్యలు తీసుకున్నారు? అనే వివరాలను ప్రజలకు వెల్లడించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తూ కనీస మౌలిక సదుపాయాలు కల్పించని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మౌనం వహించడం పలు అనుమానాలకు తావిస్తోందని వారు అంటున్నారు. ఈ వ్యవహారంపై జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.




NAGARJUNA HIGH SCHOOL
MEDCHAL
2nd Class
Price list - 2027

| SNO | PARTICULARS | PRICE |
|---|---|---|
| 1 | Telugu | 260 |
| 2 | Hindi | 265 |
| 3 | English | 510 |
| 4 | English Grammar | 375 |
| 5 | Maths | 435 |
| 6 | Evs | 534 |
| 7 | Computer | 275 |
| 8 | Note Books | 855 |
| 9 | Covers | 200 |
| 10 | Spoken English | 300 |
|  | TOTAL | 4009 |



ఇంటర్నేషనల్ పర్మిషన్ లేదు..?







ఫైర్ పర్మిషన్ లేదుగా



పేరుకే సీబీఎస్సీ..



# ఉస్మానియా లిఖించిన సరికొత్త చరిత్ర

» వైద్యుల చారిత్రాత్మక విజయం
» రోగికి ఒకేసారి 5 అవయవాల మార్పిడి
» ప్రభుత్వ వైద్య రంగ కీర్తి కిరీటంలో మరో మణిహారం
» 36 గంటల పాటు ఏకధాటిగా శస్త్రచికిత్స
» దేశంలోనే తొలిసారి ఉస్మానియా ఆస్పత్రి ఘనత..

పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ : మన రాష్ట్రంలో ఉస్మానియా ఆస్పత్రి లో ఎన్నో అరుదైన శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి అయిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. టెక్నాలజీని ఉపయోగించుకుని.. అత్యంత కఠినమైన, సంక్లిష్టమైన ఆపరేషన్లను కూడా ఉస్మానియా ఆస్పత్రి వైద్యులు.. గతంలో సక్సెస్ చేశారు. ఈ నేపథ్యంలోనే తాజాగా మరో అరుదైన ఆపరేషన్ నిర్వహించి సరికొత్త చరిత్ర సృష్టించారు. దేశంలోనే ఇప్పటివరకు ఎవరూ చేయని విధంగా ఒకేసారి ఒక రోగికి 5 అవయవాలను మార్పిడి చేసి.. ఉస్మానియా డాక్టర్లు సరికొత్త మైలురాయిని అందుకున్నారు. ప్రభుత్వ వైద్యుల ప్రతిభకు.. రోగుల ఆరోగ్యం పట్ల వారికి ఉన్న అంకితభావానికి నిలువెత్తు నిదర్శనంగా ఉస్మానియా జనరల్ హాస్పిటల్ నిలిచింది. రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ఒక 30 ఏళ్ల యువ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు ఈ ఆపరేషన్ నిర్వహించారు. ఆ టెకీ అరుదైన, ప్రాణాంతకమైన ఆరోగ్య సమస్యతో బాధపడేవాడు. ఈ క్రమంలోనే ఆ యువకుడి ప్రాణాలు రక్షించేందుకు ఉస్మానియా ఆస్పత్రి సర్జన్లు రంగంలోకి దిగారు. ఈ ఆపరేషన్ ఏకధాటిగా 36 గంటల పాటు జరగడం గమనార్హం. అత్యంత సంక్లిష్టమైన విప్లవాత్మక శస్త్రచికిత్సలో ఆ రోగికి ఒకేసారి 5 అవయవాలను విజయవంతంగా మార్పిడి చేశారు.




జీర్ణాశయం, ద్వాదశ శుక్లం, క్లోమం, చిన్న పేగు, కుడి వైపు పెద్ద పేగు వంటి 5 అవయవాలను మార్పిడి చేసి వైద్య చరిత్రలోనే ఉస్మానియా డాక్టర్లు సరికొత్త అధ్యాయం లిఖించారు. సాధారణంగా ఒక వ్యక్తికి, ఒకసారి ఒక అవయవం మార్పిడి చేయడమే డాక్టర్లకు ఎంతో పెద్ద సవాలుతో కూడుకున్న పని. అలాంటిది ఒకే సర్జరీలో 5 అవయవాలను సక్సెస్‌ఫుల్‌గా మార్పిడి చేయడం మన దేశ వైద్య చరిత్రలోనే ఇది తొలిసారి కావడం విశేషం. కార్పొరేట్ ఆస్పత్రులకు ఏమాత్రం తీసిపోని విధంగా.. ప్రభుత్వ రంగంలో ఉస్మానియా జనరల్ ఆస్పత్రి ఈ స్థాయి విజయం సాధించడం ఎంతో గర్వకారణంగా నిలిచింది.

ఉస్మానియా ఆస్పత్రి సాధించిన ఈ అసాధారణ విజయంతో తెలంగాణ ప్రభుత్వ వైద్య రంగ కీర్తి కిరీటంలో మరో మణిహారం చేరినట్లయింది. ఈ అత్యాధునిక వైద్య సేవలను పేద, మధ్యతరగతి ప్రజలకు కూడా అందుబాటులోకి తీసుకురావడంలో తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ నిరంతరం కృషి చేస్తోందనడానికి ఈ ఘటనే ప్రత్యక్ష నిదర్శనమని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఇక భారత వైద్య రంగాన్ని ప్రపంచ స్థాయిలో నిలబెట్టిన ఉస్మానియా ట్రాన్స్‌ప్లాంట్ టీమ్‌కు, ఇందుకు సహకరించిన సిబ్బందికి సర్వత్రా అభినందనలు, ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# అమల్లోకి సరికొత్త చట్టం

(మొదటి పేజీ తరువాయి)

ఈ నూతన చట్టం ప్రకారం ప్రతి ఆర్థిక సంవత్సరంలో అర్హులైన ప్రతి గ్రామీణ కుటుంబానికి ఏకంగా 125 రోజుల వేతన ఉపాధికి చట్టబద్ధమైన హామీ లభించనుంది. కేవలం శారీరక శ్రమతో కూడిన ఉపాధి మాత్రమే కాకుండా.. గ్రామీణ ప్రాంతాల్లో స్థిరమైన ఆదాయం, నీటి వనరుల సంరక్షణ, డిజిటల్, భౌతిక మౌలిక సదుపాయాల (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) నాణ్యమైన అభివృద్ధిపై ఈ చట్టం ప్రత్యేక దృష్టి సారిస్తుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ తెలిపింది. ఈ ప్రతిష్టాత్మక పథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో నిధులను భరించనున్నాయి.

ఈ నూతన చట్టం జాతీయ స్థాయి అధికారిక ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని గురువారం (జూలై 2) ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో ఘనంగా నిర్వహించనున్నారు. ఏపీలో ఈ చట్టాన్ని తక్షణమే, సమర్థవంతంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఇప్పటికే కీలక నిర్ణయం తీసుకుంది.

**తెలంగాణలో సందిగ్ధత.. !**

మరోవైపు, ఈ చట్టాన్ని తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయాలా వద్దా అనే అంశంపై తీవ్ర సందిగ్ధత నెలకొంది. ఈ పథకంలో రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధుల వాటా భరించాల్సి ఉండటంతో, దీనివల్ల రాష్ట్ర ఖజానాపై అదనపు ఆర్థిక భారం పడుతుందని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో, గురువారం భేటీ కానున్న తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం ఈ చట్టం అమలుపై చర్చించి, తుది నిర్ణయం తీసుకోనుంది.

ఏదేమైనప్పటికీ, ఈ నూతన చట్టం గ్రామీణ భారతదేశాన్ని మరింత శక్తివంతం చేసి, 'వికసిత్ భారత్' సాధనలో కీలక మైలురాయిగా నిలుస్తుందని కేంద్రం ధీమా వ్యక్తం చేస్తోంది.

# ఘాటెక్కిన అల్లం, ఉల్లి

(మొదటి పేజీ తరువాయి)

బాటలో పయనిస్తూ వినియోగదారుల కళ్లల్లో నీళ్లు తెప్పిస్తున్నాయి. వారం క్రితం హోల్‌సేల్ మార్కెట్లలో ఒక టన్ను ఉల్లి ధర రూ. 2,400 ఉండగా.. ప్రస్తుతం అది రూ. 3,400కు పైగా పలుకుతోంది. బహిరంగ మార్కెట్లలో, రిటైల్ దుకాణాల్లో వీటి ధరలు మరింత ఎక్కువగా ఉండటంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు మార్కెట్లకు వెళ్లాలంటేనే బెంబేలెత్తిపోతున్నారు. మట్నన్నటి వరకు ఉల్లిపాయ కేజీ రూ.25 వరకు ఉండగా.. ప్రస్తుతం రూ.40 వరకు చేరుకుంది. సగటున రోజుకు రూ. 10 చొప్పున ధరలు పెరుగుతుండటంతో నెలవారీ వంటగది బడ్జెట్ పూర్తిగా తలకిందులవుతోందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ధరల పెరుగుదలకు గల కారణాలను హైదరాబాద్‌లోని ప్రధాన హోల్‌సేల్ మార్కెట్ల వ్యాపారులు వివరించారు. సాధారణంగా నగరంలోని హోల్‌సేల్ మార్కెట్లకు పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటకల నుంచి ప్రతిరోజూ సగటున 150 నుండి 170కి పైగా లారీల్లో అల్లం, ఉల్లి దిగుమతులు వచ్చేవి. అయితే ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, రవాణా ఇబ్బందులు, ఆయా రాష్ట్రాల్లో నిల్వలు తగ్గడం వల్ల హైదరాబాద్‌కు వచ్చే లారీల సంఖ్య భారీగా పడిపోయింది. సరఫరా, డిమాండ్ మధ్య వ్యత్యాసం పెరగడం వల్లే ధరలు ఈ స్థాయిలో పెరిగాయని హోల్‌సేల్ వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. క్షేత్రస్థాయిలో కొత్తపంట చేతికి వచ్చి మార్కెట్లోకి పూర్తిస్థాయిలో సరఫరా పుంజుకోవడానికి మరికొంత సమయం పడుతుందని, అప్పటి వరకు ధరలు ఇవే స్థాయిల్లో కొనసాగే లేదా ఇంకా పెరిగే అవకాశాలు ఉన్నాయని వ్యాపారులు అంచనా వేస్తున్నారు.



# నిర్లక్ష్యాన్ని ఊడ్చేయండి..!

■ ఎముడాల రాజన్న చెంత అపరిశుభ్రత అఘోర నృత్యం
■ నరకప్రాయంగా మారిన ప్రభుత్వ వసతి గృహాలు!
■ రాజన్న క్షేత్ర మహిమకు పరిమళం తీసుకురండి.
■ అధికారులను డిమాండ్ చేస్తున్న భక్తులు...





**పీపుల్స్‌డైరీ–వేములవాడ :** దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి సన్నిధికి నిత్యం వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు. స్వామివారిని దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకోవడానికి తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా నలుమూలల నుండి జనం వస్తుంటారు. దూరప్రాంతాల నుండి వచ్చే భక్తుల సౌకర్యార్థం దేవస్థానం వారు పలు వసతి గృహాలను (గవర్నమెంట్ రూమ్స్) ఏర్పాటు చేశారు. అయితే, ప్రస్తుతం ఈ ప్రభుత్వ వసతి గృహాల పరిస్థితి అత్యంత దయనీయంగా, నరకప్రాయంగా తయారైంది. భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో దేవస్థానం యంత్రాంగం ఘోరంగా విఫలమైందని స్పష్టమవుతోంది. వసతి గృహాల సముదాయాల్లో పారిశుధ్యం పూర్తిగా పడకేసి, ఎటు చూసినా అపరిశుభ్రత తాండవిస్తోంది. భక్తులు నడిచే కారిడార్లలో చెత్తకుండీలు బోర్లా పడి ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. డస్ట్‌బిన్లలోని వ్యర్థాలన్నీ కారిడార్ మధ్యలోనే ఒలికిపోయి కుళ్ళిపోతున్నాయి.

ప్లాస్టిక్ కవర్లు, తిని పారేసిన ఎంగిలి విస్తరాకులు, ఆహార వ్యర్థాలు రోడ్డుపైనే దర్శనమిస్తున్నాయి. ఈ వ్యర్థాల నుండి వస్తున్న తీవ్రమైన దుర్వాసనతో భక్తులు ముక్కులు మూసుకుని తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. కారిడార్లలో ఇష్టారాజ్యంగా పడేసిన చెప్పులు, బూట్లు భక్తుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయి. పవిత్రమైన పుణ్యక్షేత్రానికి వచ్చి, ఇలాంటి అపరిశుభ్ర వాతావరణంలో గడపాల్సి రావడంపై భక్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. గదుల నిర్వహణ కోసం భక్తుల నుండి నిలవ నీడకు భారీగానే ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు సమాచారం. కాని, ఆ వసూళ్లకు తగ్గట్టుగా కనీస పారిశుధ్య ప్రమాణాలను పాటించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. గదుల లోపల, బయట నిరంతరం శుభ్రం చేయాల్సిన పారిశుధ్య సిబ్బంది ఎక్కడా కనిపించడం లేదు. వీధులను, కారిడార్లను ఊడ్వడానికి ఉపయోగించే చీపుర్లు కూడా కారిడార్‌లోనే పడేసి ఉన్నాయి తప్ప, పని మాత్రం జరగడం లేదు. సిబ్బంది నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని స్థానికులు మండిపడుతున్నారు. సాధారణ రోజుల్లోనే ఇలా ఉంటే, పండగలు మరియు సెలవు దినాల్లో రద్దీ పెరిగినప్పుడు పరిస్థితి మరీ ఘోరంగా మారుతోంది. కోట్లాది రూపాయల ఆదాయం వచ్చే దేవస్థానంలో భక్తుల ఆరోగ్యానికి కనీస రక్షణ కరువైంది. ఈ అపరిశుభ్రత వల్ల దోమలు, ఈగలు పెరిగిపోయి భక్తులు రోగాల బారిన పడే ప్రమాదం పొంచి ఉంది. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులతో వచ్చే కుటుంబాలు ఈ వసతి గృహాల్లో ఉండటానికి బెంబేలెత్తిపోతున్నారు.

దేవస్థాన గదుల్లోని ఈ దారుణమైన పరిస్థితిని చూసి చాలామంది ప్రైవేట్ లాడ్జీలను ఆశ్రయించాల్సి వస్తోంది. పేద, మధ్యతరగతి భక్తులకు భారం కాకూడదని కట్టిన ప్రభుత్వ సత్రాలు ఇప్పుడు ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి. ఉన్నతాధికారులు ఏనాడూ ఈ వసతి గృహాలను ఆకస్మిక తనిఖీలు చేసిన దాఖలాలు లేవని భక్తులు ధ్వజమెత్తుతున్నారు. ఏసీ, నాన్–ఏసీ గదుల బుకింగ్ కౌంటర్ల వద్ద ఉండే శ్రద్ధ, పారిశుధ్యంపై ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నిస్తున్నారు. సిబ్బంది కొరత సాకుతో కాలయాపన చేయడం సరికాదని భక్తులు హితవు పలుకుతున్నారు. స్థానిక పర్యవేక్షకులు కేవలం ఆఫీసులకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా దేవస్థానం ఈవో, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వసతి గృహాల ప్రాంగణాలను 24 గంటలూ శుభ్రంగా ఉంచేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలి. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న స్వీపర్లు, పారిశుధ్య కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి.

భక్తులు కూడా బాధ్యతాయుతంగా చెత్తను నిర్దేశిత డస్ట్‌బిన్లలోనే వేసేలా అవగాహన బోర్డులు ఏర్పాటు చేయాలి. బోర్లా పడిన చెత్తకుండీలను సరిచేసి, ఎప్పటికప్పుడు వ్యర్థాలను తరలించేలా నిరంతర నిఘా ఉంచాలి.

రాజన్న క్షేత్ర కీర్తి ప్రతిష్టలు మసకబారక ముందే పాలకమండలి మేల్కోవాలని భక్తులు కోరుతున్నారు. ఈ దుస్థితిపై ప్రభుత్వం స్పందించి, వేములవాడ సత్రాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని భక్తుల ప్రధాన డిమాండ్.




# మద్యం మత్తు... కక్కిన అవినీతి గుట్టు...

» సహకార సంఘంలో కోటి రూపాయల అవినీతి?
» కార్యాలయం వదిలి పక్క మండలంలో అధికారుల మందు పార్టీ...!
» మత్తులో నిజాలు కక్కిన ముగ్గురు అధికారులు!
» రైతుల పేరుతో మొక్కజొన్నల కొనుగోలు కుంభకోణమా...?
» మొత్తం వ్యవహారం వెనుక ఆ 'బడా బాబు' హస్తం?

ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం) జూలై 1 (పీపుల్స్ డైరీ) : రైతులకు అండగా ఉండాల్సిన సహకార సంఘం అవినీతి అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందా...? రైతుల చెమట చుక్కల సొమ్ముతో కొందరు పెద్దలు కోట్లు గడిస్తున్నారా? అంటే అవుననే అంటున్నాయి సహకార సంఘం అధికారుల నోటి నుంచే వచ్చిన నగ్న సత్యాలు. విధులను గాలికొదిలేసి ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లి లోని బెల్ట్ దుకాణంలో మద్యం మత్తులో మునిగితేలిన ముగ్గురు అధికారులు.. అక్కడ చేసుకున్న ముచ్చట్లు ఇప్పుడు స్థానికంగా సంచలనం సృష్టిస్తున్నాయి. తమ సొంత మండలంలో తాగితే ఎవరో ఒకరు చూస్తారని భయపడి, పక్క మండలానికి వెళ్లి మందు కొట్టిన ఈ అధికారుల మత్తు సంభాషణలో సహకార సంఘం లో జరిగిన అవినీతి కోటి రూపాయల భారీ కుంభకోణం బట్టబయలైంది...

**అధికారుల నోట.. అవినీతి మాట...!**

మద్యం మత్తు తలకెక్కడంతో తాము ఏం మాట్లాడుతున్నామో కూడా మర్చిపోయిన సదరు అధికారులు.. సహకార సంఘం కార్యాలయంలో పెద్ద ఎత్తున కుంభకోణం జరిగిందని వాపోవడం ఇక్కడ కొసమెరుపు. ఏకంగా కోటి రూపాయల మేర అవినీతి అక్రమాలు జరిగాయని, ఇందులో పెద్దల హస్తం ఉందని వారు మాట్లాడుకోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ కోటి రూపాయల కుంభకోణంలో అసలు సూత్రధారులు ఎవరు? అధికారులను పావులుగా వాడుకుని నీడన నిలిచిన ఆ బడా బాబులు ఎవరు? అన్నది ఇప్పుడు మిస్టరీగా మారింది.

**మొక్కజొన్న కొనుగోలులో కోట్లాది రూపాయల గోల్‌మాల్ ...?**

అసలు ఈ అవినీతి ఎక్కడ జరిగింది? కార్యాలయ నిర్వహణలోనా.. లేక రైతుల పేరుతో జరిగిన కొనుగోలు వ్యవహారాల్లోనా? విశ్వసనీయ సమాచారం ప్రకారం.. రైతుల పేరుతో పెద్ద ఎత్తున మొక్కజొన్న లను కొనుగోలు చేసినట్లు కాగితాల్లో చూపించి, ఆ నిధులను నేరుగా బడాబాబు వ్యక్తిగత ఖాతాలోకి మళ్లించారనే బలమైన ఆరోపణలు వినిపిస్తున్నాయి. అన్నదాతల పేర్లు వాడుకుని, ప్రభుత్వ సొమ్మును బడా బాబు అకౌంట్‌లో వేసుకుంటున్న వైనంపై ఒక అధికారి వద్ద పక్కా వీడియో సాక్ష్యాలు, ఆధారాలు ఉన్నాయని మద్యం మత్తులోనే సదరు అధికారి లీక్ చేయడం గమనార్హం.

బడాబాబు ఫోన్ బెదిరింపులు.. ఎందుకీ భయం?

తమ అక్రమాలు ఎక్కడ బయటపడతాయోనన్న భయంతో, ఆధారాలు ఉన్న అధికారిని సదరు బడాబాబు ఫోన్ లో తీవ్రంగా బెదిరిస్తున్నట్లు తెలుస్తోంది. నోరు విప్పితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరిస్తున్న ఆ బడా బాబు ఎవరు? అధికారులను తన గుప్పిట్లో పెట్టుకుని ఇంతటి భారీ స్కామ్‌కు పాల్పడింది ఎవరు? ఒక పక్క బడాబాబు బెదిరింపులు.. మరోపక్క తాము చేసిన తప్పులకు ఎక్కడ బలిపశువులం అవుతామోనన్న భయంతోనే అధికారులు పక్క మండలాలకు వెళ్లి మద్యం ఆశ్రయం పొందుతున్నారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**అసలు గుట్టు రట్టు అవుతుందా? అడుగున పడేస్తారా?**

రైతుల పొట్టగొట్టి చేసిన ఈ కోటి రూపాయల మొక్కజొన్న కుంభకోణంపై ఉన్నతాధికారుల నిఘా తేలనుందా? లేక ఎప్పటిలాగే రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి ఈ ఫైళ్లను అడుగున పడేస్తారా? అసలు తప్పు చేసింది అధికారులా.. లేక వారిని బెదిరించి తప్పు చేయించిన ఆ బడాబాబు దా? అన్నది తేలాల్సి ఉంది. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, రైతుల సొమ్మును దోచుకున్న అక్రమార్కుడితో పాటు విధులను నిర్లక్ష్యం చేసి మద్యం మత్తులో తేలుతున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక రైతాంగం డిమాండ్ చేస్తోంది. దర్యాప్తు సంస్థలు ఈ గుట్టు రట్టు చేస్తాయో లేదో వేచి చూడాలి...!

# ముదిరిన చెత్త లొల్లి

(మొదటి పేజీ తరువాయి)

గత కొన్ని రోజులుగా బీదర్ మున్సిపాలిటీకి చెందిన వ్యర్థాలను తెలంగాణ సరిహద్దులోని మల్గి గ్రామ శివారులో పారబోస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ చెత్త కారణంగా కాలుష్యం పెరిగి.. దుర్వాసనతో పాటు అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డంపింగ్ యార్డును వెంటనే తొలగించాలని వారు పలుమార్లు డిమాండ్ చేసినప్పటికీ సమస్యకు పరిష్కారం లభించలేదని చెబుతున్నారు.

చెత్తతో వచ్చిన మున్సిపల్ వాహనాలను బుధవారం రోజున మల్గి గ్రామస్తులు అడ్డుకోవడంతో ఈ పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. గ్రామస్తులు అడ్డుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన బీదర్ మున్సిపల్ అధికారులు, సిబ్బంది.. మల్గి–బీదర్ ప్రధాన రహదారిపైనే చెత్తను పారబోసినట్లు స్థానికులు ఆరోపించారు. సుమారు 40 వాహనాల చెత్తను రోడ్డుపై కుమ్మరించడంతో అంతర్రాష్ట్ర రహదారి పూర్తిగా మూసుకుపోయింది.

తమ గ్రామ శివారులో డంపింగ్ యార్డు కొనసాగించడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని మల్గి గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు. గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే విధంగా సరిహద్దు ప్రాంతంలో చెత్త పారబోయడం తగదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండు రాష్ట్రాల ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని హెచ్చరించారు.

# వక్ఫ్ బోర్డు భూములపై త్వరలో చర్యలు

» అన్ని ప్రభుత్వ అధికారులతో కలిసి నిర్ణయం
» నివాసాలు ఏర్పాటు చేసుకున్నవారికి నోటీసులు
» కలెక్టర్ ఉత్తర్వులకు సంబంధిత అధికారుల వివరణ
» ఆ భూముల్లో రిజిస్ట్రేషన్ నిలిపివేత
» సర్వే నంబర్లు పూర్తిగా బ్లాక్ చేసిన అధికారులు
» సర్వే నిర్వహణకు కాన రాని వక్ఫ్ బోర్డు అధికారులు
» ఖిల్లా వరంగల్ మండలం ఉర్సు వక్ఫ్ భూములపై సర్వే

**పీపుల్స్‌డైరీ ప్రతినిధి, వరంగల్ :** వరంగల్ ఖిల్లా వరంగల్ మండలం ఉర్సు తాళ్ళపద్మావతి కళాశాల వద్ద దాదాపు 17 ఎకరాల 5 గుంటల వక్ఫ్ భూమి స్వాధీనానికి అధికార యంత్రాంగం సమాయత్తం అయినట్టు తెలుస్తుంది. సంబంధిత సర్వే నంబర్లో రిజిస్ట్రేషన్ లు నిలిపివేసి బ్లాక్ లిస్ట్ లో పెట్టినట్టు సంబంధిత అధికారులు తెలిపారు. గృహాలు నిర్మించుకుని నివాసముంటున్న వారికి సైతం నోటీసులు జారీ చేసినట్టు తెలిసింది. వక్ఫ్ భూముల్లో కిరాయి వసూలు చేసిన వారికి సైతం నష్ట పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోనున్నట్టు నెట్వర్క్ టవర్లకు, గృహాలు అద్దెకు ఇచిన యాజమానుల నుండి వసూలు చేయటానికి నిర్ణయం తీసుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. వక్ఫ్ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై అమ్మకాలు జరిపిన వారిపై చర్యలకు సిద్ధం అయినట్టు తెలిసింది. అధికార యంత్రాంగం పూర్తి సన్నాహాలు జరుపుతుంటే వక్ఫ్ బోర్డు అధికారులు మాత్రం కనపడకుండా పోవటం పై పలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి.

# సేవ దృక్పథంతో ప్రతి ఒక్కరు పని చేయాలి : సర్పంచ్ చల్ల గురుగుల సుదర్శన్



**రేగొండ జూలై 1 పీపుల్స్ డైరీ :** మానవ సేవే మాధవసేవ అని ప్రతి ఒక్కరు సేవా దృక్పథంతో పనిచేయాలని సర్పంచ్ చల్ల గురుగుల సుదర్శన్ అన్నారు, బుధవారం రేగొండ మండలం తిరుమలగిరి గ్రామంలో ప్రజ్వల్ రైతు ఉత్పత్తి దారుల సంఘం క్షేత్ర సిబ్బంది పందుల అఖిల్ నిర్వహించినటువంటి మెగా హెల్త్ క్యాంప్ కార్యక్రమం నిర్వహించగా ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ప్రతి ఒక్కరు సేవాదృక్పథంలో ముందు ఉండాలని అనుక్షణం ఆ భగవంతుడు ఆశీస్సులు సేవ రూపంలో అందుతాయని అన్నారు మేనేజర్ సాహితీ మేడం మాట్లాడుతూ వ్యవసాయంతో పాటు మన ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలని అ లాగే సీజనల్గా వచ్చే వ్యాధుల గురించి తెలియజేసి తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు ఈ గ్రామంలో మెగా హెల్త్ క్యాంప్ కి . సహకరించిన మెడికవర్ హాస్పిటల్ యాజమాన్యానికి మరియు లయన్స్ క్లబ్ యాజమాన్యాన్ని అభినందిస్తూ వారి సేవా దృక్పథాన్ని కొనియాడారు . గ్రామం లో అనేకమంది అనారోగ్య సమస్యలతో సతమతం అవుతున్న సందర్భంలో ఈ ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం గ్రామంలో ఈ హెల్త్ క్యాంప్ నిర్వహించి సేవ దృక్పథాన్ని అభిన ందించారు ఇలాంటి కార్యక్రమాలు గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరు సద్విని యోగపర్చుకొని ఆరోగ్య సమస్యలకు వైద్య నిపుణుల చేత సలహాలు సూచనలు పాటించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమ ంలో . వివిధ రకాలైనటువంటి ఆరోగ్య సమస్యలకు పురుషులు 122 మంది స్త్రీలు 96 మంది వైద్య సలహాలు తీసుకున్నారు ఈ కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్ యాజమాన్యం మరియు లయన్స్ క్లబ్ కంటి పరీక్ష పరీక్ష నిర్వాహకులు వెంకటనారాయణ ప్రజ్వల్ క్షేత్ర సిబ్బంది మొహమ్మద్ చాంద్ పాషా , లాల్సాని రమాదేవి,రచన ఉప సర్పంచ్, వార్డ్ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు..

# అంధకారంలో రైల్వే కాలనీలోని 150 కుటుంబాలు

- వీధి దీపాల్లేక కాలనీవాసుల నరకయాతన
- చీకట్లను ఆసరాగా చేసుకుని రెచ్చిపోతున్న దొంగలు, అసాంఘిక శక్తులు
- పట్టించుకోని అధికారులు
- పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందన శూన్యం!



**మేడ్చల్, జూన్ 30 (పీపుల్స్ డైరీ) :** అభివృద్ధి మాట ఎలా ఉన్నా, కనీస అవసరమైన వీధి దీపాలు లేక ఓ కాలనీ మొత్తం చీకట్లలో మగ్గిపోతోంది. జీహెచ్ఎంసీ డివిజన్ నెంబర్ 297 పరిధిలోని రైల్వే కాలనీ గత కొన్నేళ్లుగా అంధకారంలో కొట్టు మిట్టాడుతోంది. సుమారు 150 కుటుంబాలు నివసిస్తున్న ఈ కాలనీలో గత కొన్ని సంవత్సరాలుగా కనీసం ఒక్క వీధి లైటు కూడా సరిగ్గా వెలగడం లేదు. దీంతో రాత్రి అయిందంటే చాలు కాలనీవాసులు గుండెల్లో బెదురుతో కాలం వెళ్లదీస్తున్నారు. చీకటిని ఆసరాగా చేసుకుని దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు : కాలనీలో వీధి దీపాలు లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని దొంగలు, అసాంఘిక శక్తులు రెచ్చిపోతున్నారు. వరుస దొంగతనాలతో స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో కనీసం నడవడానికి కూడా వీల్లేని పరిస్థితి నెలకొందని, చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని వారు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు కనీస సౌకర్యాలు లేకపోవడంతో పాముల భయం ఒకపక్క, మద్యం ప్రియుల విచ్చలవిడితనం ఇంకోపక్క కాలనీవా సుల నిద్రను దూరం చేస్తున్నాయి. ఎక్కడపడితే అక్కడ మద్యం సేవించి స్థానికులను ఇబ్బంది పెట్టడం తోపాటు, స్థానిక 'అలేఖ్య వెంచర్' లో విచ్చలవిడిగా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు.

## డిప్యూటీ కమిషనర్ ఇకనైనా స్పందించండి

ఈ తీవ్రమైన సమస్యపై అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని కాలనీ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మేడ్చల్ సర్కిల్ కార్యాలయ ఉన్నతాధికారులు, డిప్యూటీ కమిషనర్ వెంటనే స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు. వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, కాలనీలో కొత్త వీధి దీపాలను ఏర్పాటు చేయాలని, అలాగే రాత్రి వేళల్లో పోలీస్ పెట్రోలింగ్ పెంచి తమకు దొంగల భయం, అసాంఘిక శక్తుల వేధింపుల నుండి కాపాడాలని కాలనీ ప్రజలు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు.

## పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందన శూన్యం!

విజయమేరీ, అడ్వకేట్ కాలనీలో జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలపై గతంలోనే మేడ్చల్ పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాం. అయినప్పటికీ ఇప్పటివరకు కనీసం ఏ ఒక్క అధికారి కూడా ఇటువైపు వచ్చి పరిశీలించలేదు, ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

# వి బి జి రాంజీ నిద్దుచేసి యదావిదిగా ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలి

## సిఐటియు డిమాండ్




**ఏటూరు నాగారం జూలై 1 (పీపుల్స్ డైరీ ) :** వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, సిఐటియు సంయుక్త దేశవ్యాప్త పిలుపులో భాగంగా మూడు సంఘాల ఆధ్వర్యంలో రామన్నగూడెం, ముళ్లకట్ట, రొయ్యూరు, శంకరాయిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో నిరసనలు తెలియజేశారు,గ్రామీణ కార్మికులు, పేద రైతులు. మహిళలు, దళితులు. ఆదివాసీలు, ఇతర బలహీన వర్గాల ప్రజలు ఉపాధి భద్రత ఆదాయం మద్దతును అందించే అత్యంత ముఖ్యమైనదని ధర్నాలో ముఖ్య అతిథిగాపాల్గొన్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎండి దావూద్. టి ఎల్ రవి, తోలెం కృష్ణయ్యలు మాట్లాడుతూ ఉపాధి హామీ వ్యవస్థను బలహీనపరిచే నీరుగార్చే లేదా రద్దు చేసే ఏ ప్రయత్నం అయినా లక్షలాది గ్రామీణ కుటుంబాల జీవనోపాధిపైన మొత్తం గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పైన తీవ్ర పరిణామాలను కలిగిస్తుంది. దశాబ్దాల పోరాటం ద్వారా కార్మికులు సాధించుకున్న చట్టబద్ధమైన ఉపాధి హామీ నుండి ప్రతి పాదిత ఎన్ఆర్ఈజీఎస్ స్థానంలో కొత్త పథకాన్ని తీసుకురావడం పేదల పట్ల బిజెపి సవతి తల్లి ప్రేమ చూపడమే అవుతుందని దావూద్ ఆవేదన వ్యక్తం చేశారు. తగిన బడ్జెట్ కేటాయింపులు. సకాలంలో వేతనాల చెల్లింపులు. పని అవకాశాల విస్తరణ ఆంక్షలను తొలగించడం ద్వారా ఎన్ఆర్ఈజీఎస్ ను బలోపేతం చేయడం బదులు గా కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతూ వ్యవసాయ సంక్షోభాన్ని మరింత తీవ్రతను చేస్తుందని ప్రభుత్వాన్ని దుయ్య పట్టారు. అందువల్ల వ్యవసాయ కార్మికులు ఇతర ప్రజాస్వామ్య సంస్థలతో కలిసి ఈరోజు నిరసనలు తెలిపారని మోదీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక. కార్పొరేట్ అనుకూల విధానాలను ప్రతిఘటించడానికి గ్రామీణ భారత హక్కులను దేశ హక్కులను. జీవనోపాదులను కాపాడు కోవడానికి రైతులు. వ్యవసాయ కార్మికులు. రైతులు. కార్మికులు ఐక్యతతో పోరాటం చేయవలసిన పరిస్థితి ఆసన్నమైందని దావూద్ ప్రభుత్వంపై మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో 50 మంది పాల్గొన్నారు. బండారి నరసింహులు, రాఘవేంద్ర, వావిలాల చిన్న రామయ్య, సత్యం చింటు, సూర్య, గారభద్రమ్మ, కోకిల రవి, బొల్లె అనసూయ, గారభద్రమ్మ గారమల్లక్క బాట లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

# సీతక్కపై తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్న బీఆర్ఎస్ నాయకులు

## గద్దల నవీన్ -రామన్నగూడెం సర్పంచ్



ఏటూరు నాగారం జూలై 1 (పీపుల్స్ డైరీ) కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంత్రి సీతక్క చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక సీతక్క పై తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్న బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతున్నారనిగద్దల నవీన్ రామన్నగూడెం సర్పంచ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మంత్రి సీతక్కపై దుష్ప్రచారం చేస్తున్న వారిపై సర్పంచ్ గద్దల నవీన్ మాట్లాడుతూ సీతక్క చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్న బీఆర్ఎస్ నాయకులు. ములుగు అభివృద్ధిని అడ్డుకునే కుట్ర రాజకీయాలు ఖండనీయం. సీతక్క నాయకత్వంలో శరవేగంగా అభివృద్ధి పనులు. సోషల్ మీడియాలో పెయిడ్ ఆర్టిస్టులతో తప్పుడు ప్రచారం సరికాదు. మంత్రి ధనసరి అనసూయ సీతక్క పై కావాలనే కొందరు బీఆర్ఎస్ నాయకులు సోషల్ మీడియాలో పెయిడ్ ఆర్టిస్టులతో దుష్ప్రచారం చేస్తున్నారని రామన్నగూడెం సర్పంచ్ మండిపడ్డారు. ఇసుక దందా వంటి నిరాధార ఆరోపణలు చేసి ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం జరుగుతోందని అన్నారు. ములుగు నియోజకవర్గంలో కొండాయి బ్రిడ్జి, సెంటర్ లైటింగ్, కూరగాయల మార్కెట్లు, బస్ డిపో, సీసీ రోడ్లు, ఇందిరమ్మ ఇండ్లు వంటి అనేక అభివృద్ధి పనులు మంత్రి సీతక్క ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా 16 కోట్ల రూపాయలతో కొండాయి బ్రిడ్జి పనులు శరవేగంగా సాగుతున్నప్పటికీ వాటిని పట్టించుకోకుండా తప్పుడు ప్రచారాలు చేయడం బాధాకరమన్నారు. గత 10 ఏళ్లలో అభివృద్ధిని విస్మరించిన బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు ప్రజల్లో గందరగోళం సృష్టించడమే లక్ష్యంగా పెట్టుకున్నారని విమర్శించారు. ఆదివాసి మహిళగా ఎదిగి ప్రజాసేవ చేస్తున్న మంత్రి సీతక్కపై కుట్ర రాజకీయాలు చేయడం ఖండనీయమని, ములుగు అభివృద్ధిని ప్రజలే గమనిస్తున్నారని గద్దల నవీన్ స్పష్టం చేశారు. అదేవిధంగా బిఆర్ఎస్ పార్టీ నాయకులకు పెయిడ్ ఆర్టిస్టులతో చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు.

# భూపాలపల్లి పోలీస్ స్టేషన్ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

**భూపాలపల్లి జులై 01 పీపుల్స్ డైరీ :** భూపాలపల్లి జిల్లాలో పోలీసు సేవలను మరింత మెరుగుపర్చే దిశగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, బుధవారం భూపాలపల్లి పోలీస్ స్టేషన్ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, సీసీ కెమెరాల పనితీరు, స్టేషన్ పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు ప్రజల ఫిర్యాదులను సత్వరంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా వ్యవహరించి, నేరాల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని, ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించేలా పనిచేయాలని సిబ్బందికి ఆదేశించారు.



# హనుమకొండ మైనార్టీ గురుకులంలో 5వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

హసన్ పర్తి, జులై 1 (పీపుల్స్ డైరీ) : హనుమకొండ పెద్దమ్మగడ్డలోని మైనార్టీ గురుకుల బాలుర విద్యాలయం-1లో (హనుమకొండ బాయ్స్-1) 2026-27 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో మూడు సీట్లు ఖాళీగా ఉన్నాయని పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఖాళీల వివరాలు: ఓసీ (OC) -- 2 సీట్లు ఎస్టీ (ST) -- 1 సీటు అర్హత కలిగిన, ఆసక్తి ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు అవసరమైన ధ్రువ పత్రాలతో నేరుగా పాఠశాలను సంప్రదించి ప్రవేశ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని యాజమాన్యం సూచించింది.

## సింగరేణి మండల అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తున్న ఎంపి రామ సహాయం రఘురామ రెడ్డి, ఇమ్మడి తిరుపతిరావు యాదవ్



**సింగరేణి (కారేపల్లి) జూలై 1 (పీపుల్స్ డైరీ) :** సింగరేణి మండలాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగ ఎంపీ రఘురామ రెడ్డి కృషి చేస్తున్నారని జిల్లా కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి తిరుపతి రావు అన్నారు. ఉసిరికాయల పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఆలియా తండా లో మంచినీటి ఎద్దడి ఉన్నదని గ్రామ సర్పంచ్ వరలక్ష్మి-రాజు కోరడం తో ఎంపీ రఘురామ రెడ్డి హ్యాండ్ బోరు మంజూరు చేయించినారు. ఈ రోజు గ్రామ సర్పంచ్ వరలక్ష్మి-రాజు చేతుల మీదుగా శంకుస్థాపన జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి తిరుపతి రావు మాట్లాడుతూ ఇప్పటికే మండలంలో అనేక గ్రామాలలో అభివృద్ధికి ఎన్నో నిధులు ఇచ్చిన ఎంపీ రఘురామ రెడ్డి రానున్న రోజుల్లో మరిన్ని నిధులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గూగులోతు సంతోష్ నాయక్, జర్పుల ధోని,ఉసిరికాయలపల్లి మాజీ సర్పంచ్ బానోత్ బన్సీలాల్,ఉప సర్పంచ్ పొడుగు విజయ - సత్యనారాయణ, పదో వార్డు మెంబర్ దారావత్ రమేష్, తొమ్మిదో వార్డు ఇస్లావత్ హనుమాన్,లకావత్ రాజేష్, ధారావత్ కార్తీక్, దారావత్ మాన్సింగ్,ధారావత్ సక్రు. ధారావత్ రాంజీ. బానోత్ రాంజీ. ఇస్లావత్ వీరు, ఉడుగుల వెంకటేశ్వర్లు,బోడ సెట్ రామ్, రెడ్డబోయిన జగ్గయ్య, గుంపిడి నాగేశ్వరరావు, లావుడియా కోటేశ్వరరావు,గ్రామ పెద్దలు గ్రామస్తులు పాల్గొన్నారు.

# కీసర సహకార సంఘంలో ఘనంగా సహకార వారం ప్రారంభం

## సహకార జెండా ఆవిష్కరణ చేసిన చైర్మన్ రామిడి ప్రభాకర్ రెడ్డి




**మేడ్చల్ జూలై 1 (పీపుల్స్ డైరీ) :** భారత ప్రభుత్వ కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న సహకార వారం కార్యక్రమాలు కీసర సహకార సంఘంలో బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సంఘం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంఘం చైర్మన్ రామిడి ప్రభాకర్ రెడ్డి సహకార జెండాను ఆవిష్కరించి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ ఆర్థికాభివృద్ధిలో సహకార రంగం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. రైతులు, మహిళలు, చిన్న వ్యాపారులు, గ్రామీణ ప్రజలను ఆర్థికంగా బలోపేతం చేయడంలో సహకార సంఘాలు ప్రధాన వేదికలుగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. సహకార రంగాన్ని మరింత పటిష్ఠం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. సభ్యులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ సంఘం అభివృద్ధికి తోడ్పడాలని, సహకార స్ఫూర్తితో ఐక్యంగా పనిచేస్తే గ్రామీణాభివృద్ధి మరింత వేగవంతమవుతుందని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ పన్నాల బుచ్చిరెడ్డి, భూపాల్ రెడ్డి, మల్లేష్, మల్లారెడ్డి, ధర్మనాయక్, అమరావతి తదితరులు పాల్గొని సహకార వారం ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేశారు.

# ఘనంగా లంబాడా హక్కుల పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవం



**కోదాడ, పీపుల్స్ డైరీ:** లంబాడా హక్కుల పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవంతో పాటు సంస్థ ఎల్. హెచ్. పి.ఎస్ వ్యవస్థాపకుడు జాతీయ అధ్యక్షుడు బెల్లయ్య నాయక్ జన్మదిన వేడుకలను బాలాజీనగర్లో గిరిజన నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్హెచ్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోటియా నాయక్ సంస్థ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో కోటియా నాయక్ మాట్లాడుతూ, మా తండాలో.. మా రాజ్యం అనే నినాదంతో సాగిన ప్రత్యేక గ్రామపంచాయతీ ఉద్యమం గిరిజనుల్లో చైతన్యం నింపిందని అన్నారు. ఆ ఉద్యమ స్ఫూర్తి ఫలితంగానే 10 శాతం ఎస్టీ రిజర్వేషన్ సాధ్యమైందని పేర్కొన్నారు. చేవెళ్ల డిక్లరేషన్లో గిరిజనులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం ఎల్. హెచ్. పీ. ఎస్ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్ విద్యా సంస్థ చైర్మన్ పందిరి నాగిరెడ్డి, ఎమ్మెస్ విద్యా సంస్థ సిఓసేకు శీనుబానోతు నందలాల్ (ఎల్హెచ్పీఎస్ కార్యదర్శి), రాజు నాయక్, రవి నాయక్, సైదా నాయక్ (ఉపాధ్యక్షుడు), నిఖిల్, నాగేంద్ర, తిరుమల్, చాంద్ పాషా, సతీష్, కృష్ణ, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

పీపుల్స్ డైరీ
వరంగల్
గురువారం, 2 జూలై 2026
సంపుటి : 18, సంచిక : 117


# ఐటిఐ, ఏటీసీ లో అడ్మిషన్ల గడువు ఈనెల 10 వరకు పొడిగింపు

**ఆర్ ఐ టి ఐ ప్రిన్సిపాల్ వెల్లడి**

**ఏటూరు నాగారం జూలై 1 (పీపుల్స్ డైరీ)** స్థానిక ఆర్ ఐ టి ఐ, అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) లలో అడ్మిషన్లకై ఈనెల 10 వరకు గడువు తొడగించినట్లు ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ములుగు జిల్లాలోని పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఐటిఐలు మరియు అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో 2026 – 27 సంవత్సరానికి ప్రవేశాల కొరకు ఆన్లైన్ దరఖాస్తుల గడువు జూలై 10 వరకు పొడిగించినట్లు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య నైపుణ్యాభివృద్ధి శిక్షణ మరియు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా వివిధ మొదటి మరియు రెండు సంవత్సరాల వ్యవధి గల కోర్సులు ప్రవేశాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్ సోలార్ టెక్నీషియన్ తదితర ట్రేడ్లలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ లో 6 నూతన కోర్సులకు కూడా ప్రవేశాలు కల్పించబడతాయన్నారు. అర్హులైన విద్యార్థులు ఈనెల 10 లోపు డబ్ల్యూ డబ్ల్యూడబ్ల్యూ. ఐ టిఐటిఈ ఎల్ఏఎన్జిఏఎన్ఏ.జిఓ వి. ఐఎన్ వెబ్సైట్ ద్వారా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. నా కొరకు 9 8 4 9 6 2 1 0 3 4, 8 5 0 0 4 6 5 7 7 3, 8 5 0 0 4 6 1 2 2 7 నంబర్లకు కాల్ చేసి వివరాలు తెలుసుకోవాలన్నారు.


# సిబ్బంది లేక యూనియన్ బ్యాంకు లో తప్పని తిప్పలు

**పడి కాపులు కాస్తున్న రైతులు వృద్ధులు.**




**ఆళ్ళపల్లి జులై 1(పీపుల్స్ డైరీ) :** మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకులో సిబ్బంది కొరతతో నాన ఇబ్బందులకు గురవుతున్న రైతులు బ్యాంకు వినియోగదారులు మండల వ్యాప్తంగా 12 పంచాయతీలకు ఒకే ఒక్క బ్యాంకు ఉండటంతో ప్రత్యామ్నాయ బ్యాంకు లేకపోవడంతో రైతులు ఈ బ్యాంకు పైనే ఆధారపడవలసి వస్తుంది వేరే ఏ బ్యాంకుకు వెళ్లాలన్న సుమారు 40 కిలోమీటర్లు వెలవలసి వస్తుంది వెళ్లలేని పరిస్థితిలో ఈ బ్యాంకులో ఖాతాలు ఉన్నవారికి ఇబ్బందికరంగా మారింది ఇప్పటికే వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు విత్తనాలు ఎరువులు కొనుగోలు కొరకు అలాగే వ్యవసాయ రుణాల కోసం మరియు బంగారం తాకట్టు రుణాల కోసం ఈ బ్యాంకు ను ఆశ్రయించాల్సిందే. బ్యాంకులో సిబది లేక రుణాలు అందక రైతులు నెల రజుల నుండి నిరీక్షించే పరిస్థితి నెలకొంది. బ్యాంక్ జిల్లాస్థాయి అధికారులు స్పందించి ఈ బ్యాంకుకు పూర్తిస్థాయిలో సిబ్బందిని కేటాయించి రైతులను ఆదుకోవాలని మండల ప్రజలు రైతులు కోరుకుంటున్నారు. ఈ విషయమై బ్యాంకు మేనేజర్ ఎం మురళీకృష్ణ ను పీపుల్స్ డైరీ వివరణ కోరగా బ్యాంకులో సిబ్బంది కొరత ఉన్నది వాస్తవమేనని దీనివల్ల రైతు రుణాలు బంగారు తాకట్టు రుణాలు ఆలస్యం అవుతుందని ఇట్టి విషయమై పై అధికారులకు తెలియజేయడం జరిగిందని త్వరలోనే పూర్తిస్థాయి సిబ్బంది ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపడతారని తెలిపారు.

# దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్స్ డే వేడుకలు




**దుబ్బాక ప్రతినిధి, జూలై 01:** డాక్టర్స్ డేను పురస్కరించుకొని దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హేమ్రాజ్ సింగ్తో పాటు వైద్య సిబ్బందిని స్థానిక జర్నలిస్టులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దుబ్బాక ఎలక్ట్రానిక్ మీడియా నియోజకవర్గ అధ్యక్షుడు కరుణాకర్ మాట్లాడుతూ రోగుల పట్ల అంకితభావంతో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద రోగులకు మానవత్వంతో సేవలు అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రాణదాతలుగా సమాజంలో డాక్టర్లకు ఉన్నత స్థానం ఉందని, రాత్రింబవళ్లు తేడా లేకుండా రోగుల ప్రాణాలు కాపాడుతున్న వైద్యులకు డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు డాక్టర్ హేమ్రాజ్ సింగ్ను శాలువాతో సత్కరించి, వైద్య సిబ్బందికి మిఠాయిలు పంపిణీ చేశారు. డాక్టర్ హేమ్రాజ్ సింగ్ మాట్లాడుతూ ఈ గుర్తింపు తమ బాధ్యతను మరింత పెంచిందని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తమ టీం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జర్నలిస్టులు లక్ష్మారెడ్డి, శివకుమార్, నరేష్, శంకర్, రాజశేఖర్, ప్రసాద్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు

**మిరుదొడ్డి, జూలై 01:** వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మిరుదొడ్డి మండల కేంద్రంలో బుధవారం ముందస్తు పారిశుధ్య చర్యలు చేపట్టారు. సర్పంచ్ ఎలుముల మహేశ్వరి దేవరాజు ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికులు మురికి కాల్వలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మహేశ్వరి మాట్లాడుతూ వర్షాకాలంలో దోమలు, ఈగలు వ్యాప్తి చెంది డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి రోగాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇళ్ల పరిసరాల్లో, ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పంచాయతీ సిబ్బంది రోజువారీగా చెత్త సేకరణ, మురికి కాల్వల శుభ పరిచే పనులు చేస్తున్నారని, ప్రజలు కూడా సహకరించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయొద్దు - సీఐటీయూ నాయకులు

- మేడ్చల్లో కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా నిరసన.. దిష్టిబొమ్మ దహనం



**మేడ్చల్, జూలై 1 (పీపుల్స్ డైరీ) :** సీఐటీయూ కేంద్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం సీఐటీయూ మేడ్చల్ మండల కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా నిరసన చేపట్టి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మేడ్చల్ మండల కార్యదర్శి ఎం. నరేష్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ల అమలుతో పాటు గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరిచే చర్యలు చేపడుతోందని ఆరోపించారు. కొత్త విధానాల ద్వారా గ్రామీణ పేదల ఉపాధికి తీవ్ర నష్టం జరుగుతుందని విమర్శించారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం 90 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం నిధులు భరించే విధానం అమల్లో ఉందని, అయితే కొత్త ప్రతిపాదనల ప్రకారం రాష్ట్రాలపై 60 శాతం భారం మోపడం చట్టం స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ఈ నిర్ణయం అమలైతే రాష్ట్రాలపై ఆర్థిక భారం పెరిగి ఉపాధి హామీ పథకం నిర్వీర్యమయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని, పనిదినాలను 200 రోజులకు పెంచాలని, పట్టణ ప్రాంతాల్లో కూడా ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసి కార్మిక చట్టాలను పటిష్ఠంగా అమలు చేయాలని కోరారు. 12 గంటల పని విధానం వంటి ప్రతిపాదనలు కార్మికుల హక్కులకు భంగం కలిగిస్తాయని ఆయన అన్నారు. ఈ డిమాండ్లకు మద్దతుగా కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా దిష్టిబొమ్మను దహనం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మేడ్చల్ మండల నాయకులు ఎన్. మల్లేష్, సీహెచ్. ప్రవీణ్, ఎన్. మహేష్, ఎం. రాము, డి. రవి, ఎం. నాగరాజ్, ఎన్. నరేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వి.బి.జి-రామ్-జి చట్టాన్ని రద్దు చేయాలి:మంద సుచందర్



**హసన్పర్తి, జూలై 1,(పీపుల్స్ డైరీ) :** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వి.బి.జి--రామ్--జి చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (టీవీకేఎస్) ఆధ్వర్యంలో హసన్పర్తి ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం మండల కార్యదర్శి మంద సుచందర్ మాట్లాడుతూ, గ్రామీణ పేదలకు చట్టబద్ధంగా లభిస్తున్న పని హక్కును దెబ్బతీసే విధంగా కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలను అమలు చేస్తోందని ఆరోపించారు. ఉపాధి హామీ పథకానికి కేంద్రం నిధులు తగ్గించడం వల్ల రాష్ట్రాలపై అదనపు భారం పడుతోందని అన్నారు. వ్యవసాయ పనుల సీజన్లో ఉపాధి పనులు నిలిపివేయడం, కనీస వేతనాలపై స్పష్టత లేకపోవడం, కార్మికులపై అనవసర ఆంక్షలు విధించడం గ్రామీణ పేదల జీవనోపాధిపై ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. వి.బి.జి--రామ్--జి చట్టాన్ని వెంటనే రద్దు చేసి, కార్మికులకు అనుకూలమైన ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసన కార్యక్రమాలతో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చ రించారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు జనగాం శీను, సమ్మక్క, పల్లె చందన, పద్మ, అశ్విని, రజిత, సుకన్య, కిషన్, సదానందం, ప్రజాసం ఘాల నాయకులు కేవీపీఎస్ మండల కార్యదర్శి వేలు సుమన్, డీవైఎఫ్ఐ గ్రామ కార్యదర్శి పల్లె ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# భూపాలపల్లి ప్రభుత్వ ఆసు పత్రిలో ఉచిత ఎమ్మారై సేవలు ప్రారంభం

- పేద ప్రజల ముంగిట్లోకి అత్యాధునిక వైద్య సేవలు
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**భూపాలపల్లి జులై 1పీపుల్స్ డైరీ :** పేద ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను పూర్తిగా ఉచితంగా అందించాలనే లక్ష్యంతో భూపాలపల్లి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో హెచ్డీఎఫ్సీ బ్యాంకు సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన ఎమ్మారై (వీ=×) యంత్రాన్ని బుధవారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సంయుక్తంగా ప్రారంభించారు. కంప్యూటర్ స్విచ్ ఆన్ చేసి యంత్రాన్ని ప్రారంభించిన అనంతరం యంత్రం పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ, మారుమూల జిల్లాగా ఉన్న జయశంకర్ భూపాలపల్లిలో అత్యాధునిక ఎమ్మారై సేవలు ప్రారంభం కావడం ఎంతో సంతోషకరమన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి వరంగల్, హైదరాబాద్ వంటి నగరాల్లో లభించే కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను భూపాలపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది ఆస్పత్రిలో రోగుల అవసరాల కోసం వెంటిలేటర్లు, సీటీ స్కాన్ యంత్రాన్ని ప్రారంభించినట్లు గుర్తు చేశారు. ఆస్పత్రిని 100 పడకల నుంచి 300 పడకలకు అప్గ్రేడ్ చేయడంతో పాటు రూ. 14 కోట్ల వ్యయంతో నాలుగో అంతస్తు నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. త్వరలోనే గుండె సంబంధిత చికిత్సల కోసం క్యాథ్ ల్యాబ్ (Cath Lab) ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, హెచ్డీఎఫ్సీ బ్యాంక్ తరహాలో ఇతర బ్యాంకులు కూడా తమ సిఎస్ఆర్ నిధులతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. భూపాలపల్లి జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాలు, మహారాష్ట్ర, ఛత్తీస్గఢ్ రాష్ట్రాల ప్రజలు కూడా ఈ ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు పొందుతున్నారని పేర్కొన్నారు. సీటీ స్కాన్, ఎమ్మారై స్కాన్ సేవలను పూర్తిగా ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఈ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చిన హెచ్డీఎఫ్సీ బ్యాంకు, "డాక్టర్స్ ఫర్ యూ" సంస్థ ప్రతినిధులకు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎంజీఎం ఆసుపత్రి తర్వాత ప్రభుత్వ రంగంలో ఎమ్మారై యంత్రం ఏర్పాటు చేసిన ఆసు పత్రిగా భూపాలపల్లి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నిలవడం గర్వకారణమన్నారు. హెచ్డీఎఫ్సీ బ్యాంకు సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన ఎమ్మారై సేవల నిర్వహణ కోసం ఇద్దరు నిపుణులైన ఆపరేటర్లను నియమించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు రోడ్డు ప్రమాదాలు లేదా అత్యవసర పరిస్థితుల్లో రోగులను హైదరాబాద్, హనుమకొండకు తరలించాల్సి వచ్చేదని, ఇకపై భూపాలపల్లిలోనే ఉచిత ఎమ్మారై పరీక్షలు అందుబాటులో ఉండడంతో ప్రజలకు సమయం, ఖర్చు రెండూ ఆదా అవుతాయని పేర్కొన్నారు. ఇప్పటికే భూపాలపల్లి జిల్లాతో పాటు సరిహద్దు రాష్ట్రాల ప్రజలు కూడా ఈ ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్నారని తెలిపారు. ఆస్పత్రికి ఎమ్మారై యంత్రాన్ని అందించిన హెచ్డీఎఫ్సీ బ్యాంకు ప్రతినిధులకు జిల్లా కలెక్టర్ కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం హెచ్డీఎఫ్సీ బ్యాంకు ప్రతినిధులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, హెచ్ డీ ఎఫ్ సి క్లస్టర్ హెడ్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్ను కలిసిన మేడ్చల్ బీఆర్ఎస్ నాయకులు

- తిరుమల ప్రసాదం అందజేత పార్టీ బలోపేతం, ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంపై దిశానిర్దేశం




**మేడ్చల్, జూలై 1 (పీపుల్స్ డైరీ):** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను బుధవారం మేడ్చల్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తిరుమల శ్రీ వేంకటేశ్వ రస్వామి దర్శనం అనంతరం తీసుకొచ్చిన ప్రసాదాన్ని మేడ్చల్ జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ భాస్కర్ యాదవ్ కేటీఆర్కు అందజేశారు. సమావేశంలో మేడ్చల్ నియోజకవర్గంలోని పార్టీ పరిస్థితులు, సంస్థాగత బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. మేడ్చల్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు దయానంద్ యాదవ్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ భాస్కర్ యాదవ్లతో కేటీఆర్ పార్టీ కార్యకలాపాలపై ఆరా తీసి, నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ సార్ కార్యక్రమంలో పార్టీ నాయకులు చురుకుగా పాల్గొనాలని, ప్రజలకు పూర్తి అవగాహన కల్పిస్తూ ఓటరు నమోదు, మార్పులు, సవరణల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కేటీఆర్ సూచించినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని ఆయన పేర్కొన్నట్లు వెల్లడించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు గుర్తు చేస్తూ పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈ సమావేశం పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందని, రానున్న రోజుల్లో మేడ్చల్ నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించేందుకు నాయకులు సన్నద్ధమవు తున్నట్లు సమాచారం.

# పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, డ్రగ్స్పై విద్యార్థులకు అవగాహన




**హసన్పర్తి, జూలై 1(పీపుల్స్ డైరీ) :** హసన్పర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హసన్పర్తి పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హసన్పర్తి పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎ. మహేందర్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. డిజిటల్ మాధ్యమాలను వినియోగించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, తెలియని లింక్లను క్లిక్ చేయవద్దని, వ్యక్తిగత వివరాలు, పాస్వర్డ్లను ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. ఆన్లైన్ లేదా ఆర్థిక సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 టోల్ఫ్రీ నంబర్కు ఫోన్ చేయాలని లేదా సైబర్ క్రైమ్ పోర్టల్లో ఫిర్యాదు నమోదు చేయాలని తెలిపారు. సకాలంలో స్పందిస్తే పోగొట్టుకున్న డబ్బును తిరిగి పొందే అవకాశం ఉంటుందని చెప్పారు. డ్రగ్స్, ఇతర వ్యసనాలకు దూరంగా ఉండాలని, యువత తమ భవిష్యత్తును కాపాడుకునేందుకు చదువుపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. గంజాయి లేదా ఇతర నిషేధిత మాదకద్రవ్యాల విక్రయాలు, వినియోగంపై సమాచారం ఉంటే 1908 టోల్ఫ్రీ నంబర్కు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# భగత్ సింగ్ కాలనీ వాసులకు ఇంటి నెంబర్లు, పట్టాలు వెంటనే ఇవ్వాలి

- సోతుకు ప్రవీణ్ కుమార్, సిపిఐ జిల్లాశ్రీ కార్యవర్గ సభ్యులు
- సిపిఐ కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తత
- సిపిఐ నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

**భూపాలపల్లి జిల్లా 01 పీపుల్స్ డైరీ :** భూపాలపల్లి పట్టణంలోని సర్వే నంబర్--280లో గత నాలుగు సంవత్సరాలుగా నివాసం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న భగత్ సింగ్ కాలనీ నిరుపేద కుటుంబాలను ప్రభుత్వం పూర్తిగా విస్మరించడం దారుణమని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సోతుకు ప్రవీణ్ కుమార్ తీవ్రంగా విమర్శించారు. సిపిఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు భగత్ సింగ్ కాలనీ వాసులతో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు.

నివాస హక్కు కోసం ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, వినతిపత్రాలు సమర్పించినా, ఆందోళనలు నిర్వహించినా పాలకులు స్పందించకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఇంటి పట్టాలు, ఇంటి నెంబర్లు ఇవ్వకుండా వందలాది మంది నిరుపేదలకు తీవ్ర అన్యాయం చేస్తుందని ఆరోపించారు. భగత్ సింగ్ కాలనీ ప్రజలకు వెంటనే ఇంటి పట్టాలు, ఇంటి నెంబర్లు మంజూరు చేయడంతో పాటు మంచినీటి సౌకర్యం, విద్యుత్, సైడ్ డ్రైనేజీలు, సీసీ రోడ్లు, వీధి దీపాలు వంటి అన్ని మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ తక్షణమే స్పందించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు. సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించిన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కొంతసేపు తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న సిపిఐ నాయకులు, కార్యకర్తలను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రజల హక్కుల కోసం పోరాడుతున్న వారిపై అరెస్టులు చేయడం సమస్యలకు పరిష్కారం కాదని, భగత్ సింగ్ కాలనీ ప్రజలకు న్యాయం జరిగే వరకు సిపిఐ పోరాటం మరింత ఉధృతంగా




కొనసాగుతుందని సోతుకు ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు క్యాతరాజు సతీష్, నూకల చంద్రమౌళి, వేముల శ్రీకాంత్, నేరెళ్ల జోసఫ్, ఎండి యాకుబ్ పాషా, గోలి లావణ్య, గోనెల తిరుపతి, పీక రవికాంత్, ఉల్లెరావు బన్నీ, రమ్య చారి, పల్లెల రజిత, గంప శ్రావణి, ఇటుకల శ్రీలత, పెద్దమాముల సంధ్య, గడ్డం స్వరూప పోతుగంటి స్వప్న, వాసం రజిత, పాండవుల రాజేశ్వరి, కట్టెకోళ్ల భారతి సంపత్, కంకల గట్టయ్య, బట్టు శ్రీనివాస్, వంగరి రాంబాబు, యాతం మల్లేష్, దుర్గయ్య రాజు తదితరులు, భగత్ సింగ్ కాలనీ వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వృద్ధురాలి ఆస్తుల కోసం వేధింస్తున మాజీ సర్పంచ్ రాజేశ్వర్

**3 ఏళ్లుగా వేధిస్తున్నారంటూ మంద లక్ష్మీ ఆరోపణ**

**నిజామాబాద్,వేల్పూర్, జూలై 01( పీపుల్స్ డైరీ) :**వేల్పూర్ మండలం పడగల్ ఒంటరి జీవితం గడుపుతున్న ఒక వృద్ధురాలు తన సొంత గ్రామంలోనే గత మూడు సంవత్సరాలుగా తీవ్ర మానసిక, శారీరక ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని మీడియా ముందు కన్నీటి పర్యంతమయ్యారు. నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం పడగల్ గ్రామానికి చెందిన మంద లక్ష్మీ వయసు 70 ఏళ్లు. భర్త మరణించిన తర్వాత నుంచి ఆమె ఒంటరిగా జీవనం సాగిస్తున్నారు. తనకు ఉన్న కొద్దిపాటి వ్యవసాయ భూమి, ఇంటి స్థలమే ఆమెకు ఆధారమని చెబుతున్న ఆమెకు, అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మంద రాజేశ్వర్ వల్ల నరకం చూస్తున్నానని ఆరోపిస్తున్నారు.

**"కడుపు మాడ్చి సంపాదించిన ఆస్తి"**

మీడియాతో మంద లక్ష్మీ మాట్లాడుతూ "నా భర్త బతికుండగా కష్టపడి కొనుక్కున్న రెండెకరాల భూమి, ఇల్లు ఇవే నాకు దిక్కు. పిల్లలు లేకపోవడంతో ముసలితనంలో అదే నాకు కూడు పెడుతుంది. కానీ అదే ఆస్తిని



లాక్కోవాలని మాజీ సర్పంచ్ మంద రాజేశ్వర్ గత మూడు సంవత్సరాలుగా నన్ను వదలడం లేదు" అని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తూ చెప్పిన దాని ప్రకారం, మొదట్లో బతిమాలడం, తర్వాత బెదిరించడం, పత్రాలపై బలవంతంగా సంతకాలు చేయించే ప్రయత్నం చేసినట్లు తెలిపారు. "ఒంటరి ముసలిదాన్ని ఎవరికి చెప్పుకుంటాను? పోలీసులకు వెళ్తే 'మీ గొడవలు మీరే పరిష్కరించుకోండి' అంటారు. ఊరిలో చెబితే 'ఆయన పెద్ద మనిషి' అని నోరు మూయిస్తున్నారు"అని ఆమె వాపోయారు. ఈ వ్యవహారం పడగల్ గ్రామంలో గత కొంతకాలంగా చర్చనీయాంశంగా మారింది. ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలిని ఆస్తుల పేరుతో వేధించడం సరికాదని కొందరు గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు, ఇది కుటుంబ, ఆస్తి సంబంధిత వివాదమని, చట్టపరంగా పరిష్కరించుకోవాల్సిన అంశమని మరికొందరు అంటున్నారు. ఈ ఆరోపణలపై మాజీ సర్పంచ్ మంద రాజేశ్వర్ నుంచి మా విలేకరి వివరణ కోరగా, ఆయన ఇంకా స్పందించలేదు. తనకు న్యాయం జరగకపోతే జిల్లా కలెక్టర్, ఎస్పీ కార్యాలయం మెట్లెక్కుతానని మంద లక్ష్మీ స్పష్టం చేశారు. "నాకు న్యాయం కావాలి. నా ఆస్తి నాకు దక్కాలి. ముసలితనంలో ప్రశాంతం గా బతకనివ్వాలి" అని ఆమె కోరారు. కులం సంఘాలు,కూడా ఈ ఘటనపై స్పందించి, వృద్ధు రాలికి చట్టపరమైన సహాయం అందించేందుకు ముందుకు వస్తామని హామీ ఇచ్చారు.

# ఉపాధీ దూరం చేసే వీబీజీ రామ్ జీ ని రద్దచేయాలి

**ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన**

**సింగరేణి(కారేపల్లి) జులై 1 (పీపుల్స్ డైరీ):** పేదలకు ఉపాధిని దూరం చేసే వీబీజీ రామ్ జీ ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం కారేపల్లి తహసీల్దార్ కార్యాలయం, ఎర్రబోడు, మాణిక్యారం, విశ్వనాథపల్లి, గాంధీనగర్, గాదెపాడు , చీమలపాడు గ్రామపంచాయతీ కార్యాలయాల ఎదుట అందోళన చేపట్టారు. అంక్షలు లేకుండా పేదలకు ఉపాధి కల్పించాలని, రైతులకు నష్టదాయకమైన విద్యుత్ సవరణ చట్టం, నాల్గు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు, సీఐటీయు మండల కన్వీనర్ కే.నరేంద్ర, రైతు సంఘం మండల కార్యదర్శి వజ్జా రామారావులు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం మహాత్మగాంధీ జాతీయ గ్రామీణా ఉపాధి హామీని రద్దు చేసి పీవీజీ రామ్ జీ పేరుతో పేదలకు ఉపాధి దూరం చేయుటకు పూనుకుందన్నారు. వీబీజీ రాంజీ బిల్లును జులై 1 నుండి అమలు చేయనున్నట్లు ప్రకటించిందని, దీనిలో కేంద్రం 60 శాతం రాష్ట్రం 40 శాతం నిధులు భరాయించాలని పేర్కొనటం ఉపాధి కల్పన నుండి కేంద్రం దూరం జరగటమేనన్నారు. నాలుగు లేబర్ కోడ్ లను తీసుకవచ్చి కార్మిక హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తుందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే రైతు భరోసా ఎగవేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకంగా రైతు డిస్ట్రిబ్యూషన్ కంపెనీని ఏర్పాటు చేసి ఉచిత కరెంట్ కు మంగళం పాడే పరిస్థితిని తీసుకరానుందన్నారు. కేంద్ర, రాష్ట్ర పాలకుల తీరుపై పోరాటాలే శరణ్యమన్నారు. పోరాటాలతోనే పాలకుల దిగివచ్చి పేదలకు అనుకూల నిర్ణయాలు తీసుకుంటారన్నారు. ఈకార్యక్రమంలో వ్యకాస మండల అధ్యక్ష, కార్యదర్శులు కేసగాని ఉపేందర్, యనమనగండ్ల రవి, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల




అధ్యక్షకార్యదర్శులు శనగ రాంబాబు, కేలోతు రవి, రైతు సంఘం మండల కార్యదర్శి వజ్జా రామారావు, నాయకులు పండగ కొండయ్య, ఈసం సలీం, ఎండి ఇస్మాయిల్, రేగళ్ల మంగయ్య, షేక్ సైదులు, కుర్సం శ్రీను, గంగాధరణి ఉపేంద్ర చారి, చల్లా మల్లమ్మ, కరపటి లక్ష్మయ్య, సురభి సీత, ఎర్రిపోతు ముత్యాలు, రాచర్ల రణధీర్, భూక్య లక్ష్మణ్, నరసింహారావు, అబ్రహం, సారయ్య, కిరణ్, మున్న, జగదీష్, సూర్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి


- బీ.ఎల్.వోల ఇంటింటి ఫారాల పంపిణీని పరిశీలించిన కలెక్టర్ బి. సత్య ప్రసాద్

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, జులై 01:** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్.ఐ.ఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఓటరికి అవకాశం కల్పించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం కోరుట్ల పట్టణం కేంద్రంలో బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఎస్ఐఆర్ ఫారాలను పంపిణీ చేస్తున్న విధానాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలు ఓటర్లకు ఫారాల పంపిణీ, వివరాల నమోదు, అవగాహన కల్పన తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ఓటర్లకు ఫారాలను అందజేయాలని,



ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనల ప్రకారం పని చేయాలని అన్నారు. ఓటర్ల నుంచి అందిన ఫారాలను నిర్ణీత గడువులోగా స్వీకరించి, వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు కూడా ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొని సరైన సమాచారం అందించాలని కోరారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసే కీలక ప్రక్రియ అని పేర్కొన్న కలెక్టర్, అధికారులు, బీఎల్‌వోలు పూర్తి బాధ్యతతో విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీఓ జీవాకర్ రెడ్డి, తహసీల్దార్ హకీమ్, సంబంధిత సిబ్బంది, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 1న గీతం 17వ పట్టభద్రుల ప్రదానోత్సవం



**పటాన్చెరు, జూలై 1:**గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లో 17వ పట్టభద్రుల ప్రదానోత్సవం (గ్రాడ్యుయేషన్ డే)ను ఆగస్టు 1, 2026 (శనివారం)న నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ డి. గుణశేఖరన్ తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరంలో అండర్ గ్రాడ్యుయేట్ (యూజీ), పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ), పీహెచ్.డీ. కోర్సులను విజయవంతంగా పూర్తిచేసిన విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి అర్హులని పేర్కొన్నారు. ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, సైన్స్, ఫార్మసీ, హ్యూమానిటీస్, ఆర్కిటెక్చర్ తదితర విభాగాలకు చెందిన పట్టభద్రులు తమ విద్యా విజయాలను ఘనంగా జరుపుకునే అవకాశం ఈ కార్యక్రమం ద్వారా లభించనుంది. అర్హులైన విద్యార్థులు జూలై 3 నుంచి 17వ తేదీ వరకు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ, స్నాతకోత్సవానికి సంబంధించిన పూర్తి వివరాలు, మార్గదర్శకాల కోసం గీతం అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు. యూనివర్సిటీ నాయకత్వం, అధ్యాపకులు, తల్లిదండ్రులు, ప్రముఖ అతిథుల సమక్షంలో విద్యార్థులు తమ విద్యా ప్రయాణాన్ని స్మరించుకుంటూ, వృత్తిపరమైన జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించే వేడుకగా ఈ పట్టభద్రుల ప్రదానోత్సవం నిలవనుందని ప్రకటనలో పేర్కొన్నారు.

# గ్రామ ప్రజల రవాణా కోసం దాత ఎలక్ట్రికల్ ఆటో బహుకరణ

**దాత శ్రీశ్రీశ్రీ స్వామి సద్గురు సమర్థ మహారాజుకు కృతజ్ఞతలు తెలిపిన ధర్మాజీపేట గ్రామస్తులు**



**దుబ్బాక ప్రతినిధి, జూలై 01:** దుబ్బాక మున్సిపాలిటీ ధర్మాజీపేట గ్రామ ప్రజలు తమ అవసరాల కోసం నిత్యం వివిధ గ్రామాలకు ప్రయాణం చేయుటకు, దుబ్బాకకు వెళ్లిరావడానికి ఎంతో ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న శ్రీశ్రీశ్రీ స్వామి సద్గురు సమర్థ మహారాజు ధర్మాజీపేట గ్రామానికి బుధవారం ఒక ఎలక్ట్రికల్ ఆటోను తన స్వంత డబ్బులను వెచ్చించి కొనుగోలు చేసి బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీరామ్ సంగీత రవీందర్, వైస్ చైర్మన్ ఆస సులోచన స్వామి. కౌన్సిలర్లు వనం రమేష్, గోవింద్ గారి శోభారాణి, విష్ణువర్ధన్ రెడ్డి, మెరుపుల సాయికుమార్ గౌడ్, ధర్మాజీపేట నాయకులు, యువకులు, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు. ధర్మాజీపేట ప్రజల ప్రయాణ సౌకర్యార్థం ఎలక్ట్రికల్ ఆటో అందజేసినందుకు ధర్మాజీపేట కౌన్సిలర్లు, నాయకులు, ప్రజలు, చిన్నలు, పెద్దలు అందరూ శ్రీశ్రీశ్రీ స్వామి సద్గురు సమర్థ మహారాజుకు ప్రత్యేక కృతజ్ఞతలు అందజేశారు. మానవతా దృక్పథంతో ఇలాంటి స్ఫూర్తిదాయకమైన నిర్ణయాన్ని తీసుకొని గ్రామస్తులకు ఈ సౌకర్యాన్ని కల్పించడం పట్ల వారు మనస్ఫూర్తిగా కృతజ్ఞతతో ధన్యవాదాలు తెలుపుతూ అభినందించారు.

# ఓటర్ ఏన్యుమరేషన్ ఫారంలలో తప్పులు లేకుండా పూర్తి చేసి అందించాలి

**బిజెపి సీనియర్ నాయకులు ఉప్పల్ మాజీ శాసనసభ్యులు ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్**



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి,(ఉప్పల్),జూలై 1:** భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "సర్" ప్రక్రియలో భాగంగా బుధవారం బూత్ నెంబర్ 290, ప్రజాసేవకుడు ఉప్పల్ మాజీ శాసనసభ్యులు, ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ కు జిహెచ్ఎంసి అధికారి బి ఎల్ ఓ మమత రామంతాపూర్ డివిజన్ అధ్యక్షులు వంగాల సంతోష్ గుప్తా బి ఎల్ ఏ 2 తాళ్ల బాలకృష్ణ గౌడ్ ఎన్యూమరేషన్ ఫారం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ ఓట్ల గల్లంతు కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, గతంలో జరిగిన ఎన్నికల్లో పలువురి ఓట్లు సాంకేతిక కారణాల వల్ల లేదా బూత్‌ల మార్పు వల్ల గల్లంతయ్యాయని, ఈసారి ఎస్ఐఆర్ సర్వే ద్వారా అలా జరగకుండా బూత్ స్థాయి అధికారులు ( బి ఎల్ ఓ ) లు ప్రతి ఇంటినీ జాగ్రత్తగా వెరిఫై చేయాలని బూత్ స్థాయి అధికారులు ఇంటికి వచ్చినప్పుడు ప్రజలు తమ వివరాలను సరిచూసుకోవాలని, ఎన్యూమరేషన్ ఫారాలను తప్పులు లేకుండా పూర్తి చేసి అందించాలని సూచిస్తున్నారు, అంతేకాకుండా ఒకే వ్యక్తికి రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఓటు హక్కు ఉండటం వంటి అక్రమాలకు తావులేకుండా, పారదర్శకంగా జాబితా రూపొందించేలా ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరానగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులుగా అలీమ్ భాయ్



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి,(ఉప్పల్),జులై1:** ఇందిరా నగర్ నూతన అధ్యక్షులుగా ఎన్నికైన అలీమ్ భాయ్ ని బి ఆర్ యస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ వారి కార్యాలయంలో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు, ఈ సందర్భంగా సాయిజన్ శేకర్ మాట్లాడుతూ నూతన అధ్యక్షుడి తో కలిసి ఇందిరానగర్ లో మిగిలిన అభివృద్ధి పనులన్నీ పూర్తి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో,చంద్రశేఖర్, టేకి రాజశేఖర్ పాండునాయక్, పెంటయ్య శ్రీనివాస్,అశోక్,తదితరులు పాల్గొన్నారు

# ఇందిరమ్మ మహిళా శక్తి చీరలను పంపిణీ

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి , జూలై 1:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రోడామేస్త్రి నగర్ డివిజన్ పరిధిలోని శ్రీరామ్ నగర్‌లో బుధవారం రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయ మహిళా సంఘాల సభ్యులకు అందజేస్తున్న ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ డీసీసీ ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూన శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమం, సాధికారత, ఆర్థికాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని అన్నారు. మహిళల కోసం ఉచిత బస్సు ప్రయాణం, స్వయం సహాయ సంఘాల సభ్యులకు వడ్డీ లేని రుణాలు, సబ్సిడీపై ఆర్టీసీ బస్సుల కల్పన వంటి కార్యక్రమాల ద్వారా వారి ఆర్థిక స్వావలంబనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. మహిళలు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని కుటుంబాలతో పాటు సమాజ అభివృద్ధిలోనూ ముందుండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు రమణి, నిర్మల, మంజుల, కౌసల్యతో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు సిహెచ్ బుచ్చిరెడ్డి, మధుసూదన్, రఘురెడ్డి, వెంకటేష్, బాలకృష్ణ, బలరాం, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన రేషన్ షాపు ప్రారంభోత్సవం

**ముఖ్య అతిథిగా డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్**



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి (ఉప్పల్) జులై 1:** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ బోడుప్పల్ డివిజన్ పరిధిలోని ఈస్ట్ బాలాజీహిల్స్ కాలనీలో ఏర్పాటు చేసిన నూతన రేషన్ షాపును మేడ్చల్--మల్కాజ్గిరి డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ స్థానిక మాజీ కార్పొరేటర్ భూక్య సుమన్ బ్లాక్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ కొత్త కిషోర్ గౌడ్ ల తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన ప్రజా పంపిణీ వ్యవస్థను అందించేందుకు కట్టుబడి ఉందన్నారు. స్థానిక మాజీ కార్పొరేటర్ భూక్య సుమన్ మాట్లాడుతూ ఇక్కడి ప్రజల ఎన్నో ఏండ్ల కలను సాకారం చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రష్ యాదవ్ కు మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. స్థానిక ప్రజలు ఈ రేషన్ షాప్ ద్వారా ప్రభుత్వం అందించే సరుకులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక సీనియర్ నాయకులు, రేషన్ షాప్ యాజమాన్యం, కార్యకర్తలు, అధికారులు, మరియు కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రంథాలయాన్ని ఆకస్మిక తనిఖీ




**మిరుదొడ్డి, జూలై 01:** సిద్దిపేట జిల్లా బాగా నియోజకవర్గంలోని మిరుదొడ్డి మండల కేంద్ర ప్రభుత్వ గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలు, పాఠకులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ గ్రంథాలయానికి ఎంతమంది విద్యార్థులు చదువుకోవడానికి వస్తున్నారనే విషయంపై విచారించి, సందర్శకుల సంతకాల నమోదుపుస్తకాన్ని పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు లేదా ఇతర సౌకర్యాలు ఏమైనా ఉంటే తెలియజేయాలని సిబ్బందికి సూచించారు. అవసరమైన పుస్తకాలను త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది రాజు, హరి ప్రసాద్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# తొగుట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పంది రాజు

**తొగుట, జూలై 01:** కాంగ్రెస్ పార్టీ తొగుట మండల అధ్యక్షుడిగా మండలంలోని వెంకటరావుపేటకు చెందిన సీనియర్ నాయకులు పంది రాజు నియమితుల య్యారు. దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి బుధవారం ఈ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు పంది రాజు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి కాంగ్రెస్ పార్టీ మండల బాధ్యతలు అప్పగించిన దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా తన నియామకానికి సహకరించి ప్రోత్సహించిన దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డికి, తొగుట ఏఎంసీ చైర్మన్ చెరుకు విజయ రెడ్డికి, తాజా మాజీ అధ్యక్షులు అక్కం స్వామికి మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధిష్ఠానం తనకు అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తానని, మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు. పార్టీ తనపై పెట్టుకున్న విశ్వాసాన్ని నిలబెట్టుకునేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా నిబద్ధతతో పనిచేస్తానని, మండలంలో పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, గ్రామ స్థాయి నుండి పార్టీని పటిష్ఠం చేస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యకర్తలతో కలిసి నిరంతరం పని చేస్తానని పంది రాజు పేర్కొన్నారు.

# కలెక్టర్ ను కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి,(ఉప్పల్),జులై 1:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం లో మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మనూ చౌదరి ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గానికి సంబంధించిన పలు ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు,మౌలిక సదు-పాయాల కల్పన పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయడం, ప్రజలకు మెరుగైన సేవలు అందించే అంశాలపై సమగ్రంగా చర్చించారు. నియోజకవర్గ ప్రజలకు అవసరమైన సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కలెక్టర్‌ను కోరారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి జిల్లా పరిపాలన ఎల్లప్పుడూ సహకరిస్తుందని కలెక్టర్ మనూ చౌదరి ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.

# సీఎన్ఎల్‌యూ-గిగా ఇన్నోవేషన్ ఆధ్వర్యంలో సైబర్ భద్రత పరిశోధన కేంద్రం ప్రారంభం

- సైబర్ భద్రత, డేటా పరిరక్షణ, కృత్రిమ మేధస్సుపై పరిశోధనలకు ప్రాధాన్యం
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లా చేతుల మీదుగా ప్రారంభం
- జాతీయ స్థాయిలో పరిశోధన, శిక్షణ, విధాన రూపకల్పనకు వేదికగా కేంద్రం



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి,(ఉప్పల్), జూలై 1,:** చాణక్య నేషనల్ లా యూనివర్సిటీ (సీఎన్ఎల్‌యూ), హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇంక్యుబేట్ అయిన గిగా ఇన్నోవేషన్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ అండ్ డేటా ప్రొటెక్షన్ కంప్లయన్స్ రీసెర్చ్ యూనిట్‌ను మంగళవారం ప్రారంభించారు. భారత సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లా పరిశోధన కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పాట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, సీఎన్ఎల్‌యూ ఛాన్సలర్ జస్టిస్ మీనాక్షి మదన్ రాయ్, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ నాని టాగియా, జస్టిస్ రాజేష్ కుమార్ వర్మ, బీహార్ అడ్వకేట్ జనరల్ సత్య దర్శి సంజయ్, సీఎన్ఎల్‌యూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ ఫైజాన్ ముస్తఫా, గిగా ఇన్నోవేషన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ తొగరు అభిషేక్ రెడ్డి, డైరెక్టర్ రావుల రామకాంత్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.పీ. సింగ్ తదితరులు పాల్గొన్నారు. సైబర్ భద్రత, డేటా పరిరక్షణ, గోప్యత, కృత్రిమ మేధస్సు, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాల్లో పరిశోధనలు, విధానాల రూపకల్పన, శిక్షణ కార్యక్రమాల నిర్వహణ లక్ష్యంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ దేశంలో వేగంగా పెరుగుతున్న సైబర్ ముప్పులను ఎదుర్కొనేందుకు బలమైన న్యాయ, సాంకేతిక, పాలనా వ్యవస్థలు అవసరమని పేర్కొన్నారు. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ చట్టం--2023 అమలు, జాతీయ సైబర్ భద్రతా కార్యక్రమాలు, కృత్రిమ మేధస్సు పాలన, డిజిటల్ పరిపాలనకు సంబంధించిన అంశాలపై కేంద్రం పరిశోధనలు చేపట్టనున్నట్లు తెలిపారు. డేటా పరిరక్షణ, సైబర్ భద్రత, కంప్లయన్స్, గోప్యత, కృత్రిమ మేధస్సు, సైబర్ చట్టాలు, ప్రజా విధానాలపై ప్రత్యేక అధ్యయనాలతో పాటు ప్రభుత్వ సంస్థలు, పరిశ్రమలు, అంతర్జాతీయ భాగస్వాములతో సంయుక్త పరిశోధనలు, శిక్షణ కార్యక్రమాలు, సర్టిఫికెట్ కోర్సులు నిర్వహిం చనున్నట్లు వెల్లడించారు. సైబర్ భద్రత, డేటా పరిరక్షణ రంగాల్లో పరిశోధన, విధాన సూచనలు, నైపుణ్యాభివృద్ధికి ఈ కేంద్రం జాతీయ స్థాయిలో కీలక వేదికగా నిలు స్తుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా తొలగకూడదు: మంత్రి వివేక్

- కాట శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో సదస్సు
- ఫారం-6, 7, 8 వినియోగం, ఓటర్ల జాబితా సవరణపై మార్గదర్శకాలు




**పటాన్‌చెరు, జులై 1:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ SIRప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు బూత్ లెవెల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా పనిచేయాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు ఒ భూగర్భ శాస్త్ర శాఖల మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి సూచించారు. రామచంద్రాపురంలోని బాలాజీ గార్డెన్స్‌లో పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన SIR అవగాహన సదస్సులో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఎల్ఏలకు ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తుల వినియోగం, 2002 ఓటర్ల డేటా మ్యాపింగ్, ఓటర్ల జాబితా సవరణలో అనుసరించాల్సిన ఎన్నికల సంఘం మార్గదర్శకాలపై అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదు అయ్యేలా, ఎలాంటి పొరపాట్లు జరగకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రి వివేక్ వెంకటస్వామి సూచించారు. కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, SIR ప్రక్రియలో బీఎల్ఏల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా, ప్రతి అర్హుడి వివరాలు నమోదు అయ్యేలా పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కోఆర్డినేటర్ వెన్నెల, డీసీసీ అధ్యక్షురాలు, టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ నీలం మధు, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ గాలి అనిల్ కుమార్, సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా, ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శివానందం, మాజీ కార్పొరేటర్ పుష్ప నాగేష్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, బీఎల్ఏలు పాల్గొన్నారు.

# వైద్యులు ప్రజలకు ప్రాణాలను కాపాడే దైవ స్వరూపులు

- వైద్యుల సేవలు వెలకట్టలేనివి
- డాక్టర్ రేఖరాణి, సూపరింటెండెంట్ డిస్ట్రిక్ట్ హాస్పిటల్ గజ్వేల్



**గజ్వేల్ ప్రతినిధి, జూలై 01 :** వైద్యులు ప్రజల ప్రాణాలను కాపాడే దైవ స్వరూపులని, ప్రజలకు వైద్యులు చేసే సేవలు వెలకట్టలేనివని గజ్వేల్ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రేఖరాణి పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో బుధవారం జాతీయ వైద్యుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రేఖారాణి మాట్లాడుతూ అమ్మ జన్మనిస్తే, వైద్యులు పునర్జన్మ ఇస్తారని, "వైద్యో నారాయణో హరి" వైద్యులు అంటే సాక్షాత్తు భగవంతుని సమానమని అపారమైన ఒత్తిడి, నిస్సత్తువ, భావోద్వేక, సవాళ్లను ఎన్నో ఎదుర్కొంటూ వైద్యులు ఓపికగా వైద్యం అందిస్తూ సాధారణ ప్రజల ప్రాణాలను కాపాడి తమ జీవితాలను అంకితం చేస్తున్నారని కొనియాడినారు. అవిశ్రాంతి, కృషి, త్యాగము, అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎంతోమంది ప్రాణాలకు కొత్త జీవం అందిస్తూ, తమ సేవా భావంతో, సమాజానికి అండగా ఉంటూ, సమయము, పరిస్థితి, అలసట, అని తేడా లేకుండా ప్రతి రోగి ఆరోగ్యం ముఖ్యంగా వైద్య రంగానికి విశేష సేవలు అందించే డాక్టర్ల సేవలు అమూల్యమని అభినందించారు. మనదేశంలో ప్రసిద్ధి చెందిన వైద్యులలో పశ్చిమబెంగాల్ రెండవ ముఖ్యమంత్రి డాక్టర్ బీదాన్ చంద్ర రాయ్ జన్మదినాన్ని పురస్కరించుకొని డాక్టర్స్ డే జరుపుకుంటామని వైద్య రంగానికి విశేష సేవలు అందించి తాను సంపాదించింది అంతా పేదలకు చెందాలని ఆకాంక్షించిన మానవతా వాదని కొనియా డినారు. ఈ సందర్భంగా హాస్పిటల్స్ సూపరింటెండెంట్ డాక్టర్ రేఖరాణి హాస్పిటల్లో పనిచేస్తున్న డాక్టర్లను సన్మానించారు. అనంతరం కేకు కట్ చేసి ఆప్యాయంగా సంతోషాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాము ఆర్ఎంఓ, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ రాకేష్ సింగ్ ఆప్తమాలోజిస్ట్, డాక్టర్స్ బిందు, మహేశ్వరి, సమీక్ష, రజిత,సాయి శ్రీ, డాక్టర్ ప్రియాంకళ్, నర్సింగ్ సూపరిండెంట్స్ శివపార్వతి, సువర్ణ ఉమామహేశ్వరి, హెడ్ నర్స్ రాంబాయి, ఉజ్మా ఖాదర్, రమాదేవి, రోజులిన్, హెల్త్ ఇన్స్పెక్టర్ లక్ష్మి, నర్సింగ్ ఆఫీసర్లు గౌతమి, యాదమ్మ, విజయ్ కుమారి, కల్పన, మహేశ్వరి, మంజులత, మంజూష, ఆఫీస్ స్టాఫ్ లలిత, అఖిల, కమలాకర్, సుధాకర్, హెల్త్ అసిస్టెంట్ దేవసాని వాసుదేవ్, పారామెడికల్, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# వడ్డెర కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి:ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్చెరు, జులై 1:** ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని చిట్కుల్ వడ్డెర కాలనీలో నెలకొన్న సమస్యలను అతి త్వరలో పరిష్కరించడం జరుగుతుందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ కాలనీ ప్రజలకు హామీ ఇచ్చారు. బుధవారం ఉదయం స్థానిక మున్సిపల్ చైర్మన్ సుమలత, కమిషనర్ వెంకట కిషన్, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, మాజీ జెడ్పిటిసి శ్రీకాంత్ గౌడ్, కౌన్సిలర్లతో కలిసి కాలనీలో పర్యటించారు. కాలనీ ప్రజలతో సమావేశమై వారు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా సిసి రోడ్లు, అంతర్గత మురుగునీటి కాలువలు, ఇంటి నంబర్ల అంశంలో ఇబ్బందులు ఎదుర్కొంటామని వారు ఎమ్మెల్యే జిఎంఆర్ దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపల్ తరపున ప్రత్యేక నిధులు కేటాయించి అతి త్వరలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తామని తెలిపారు. కాలనీలో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. కాలనీలో నూతనంగా నిర్మించిన మునీశ్వర ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆరవ వార్డు పరిధిలోని ఎస్వి హోమ్స్ కాలనీలో మిషన్ భగీరథ పైప్లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, కౌన్సిలర్ పాండు, నరేందర్ రెడ్డి, కౌన్సిలర్లు ఆంజనేయులు, వెంకటేష్, కిషోర్ రెడ్డి, రాహుల్ రెడ్డి, గద్దె రాజు, నవీన్ రెడ్డి, లత, కో ఆప్షన్ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి, బాబా, బంద రాజు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండాలి

**సంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య**

**సర్, బిఎల్‌ఏల శిక్షణ రివ్యూ సమావేశం**

**సంగారెడ్డి ప్రతినిధి, జూలై 01 :** సంగారెడ్డి జిల్లా రాయికోడు మండలం సర్ ప్రక్రియలో భాగంగా, బిఎల్వోల ముఖ్య సమావేశంలో సంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ సర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఓటర్కి అవకాశం కల్పించాలని తెలిపారు. బిఎల్వోలు, సర్ ఫారాలను పంపిణీ చేస్తున్న విధానాన్ని కూడా పరిశీలించాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ఓటర్లకు ఫారాలను అందజేయాలని ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ బిఎల్ఓలు ఖచ్చితమైన పనులు చేయాలని తెలిపారు. ఓటర్ల ఫారాలను మిన్నేత గడువులోగా స్వీకరించి వివరాలను క్షుణంగా పరిశీలించాలని అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎంసీ చైర్మన్ మాజీ సిద్దన్న పాటిల్, రాయికోడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాలాజీ నర్సింలు, కేదార్నాథ్ పాటిల్, బసవరాజ్ పాటిల్, నాగిశెట్టి, ప్రభాకర్, సతీష్ కులకర్ణి, వినయ్ కుమార్, దర్శన్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు మాజీ సర్పంచులు ఎంపీటీసీలు, మాజీ ఎంపీటీసీలు సీనియర్ నాయకులు, బిఎల్ఏలు నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



# వామపక్షాల పికెటింగ్‌తో దద్దరిల్లిన వరంగల్ కలెక్టరేట్

## ఏకశిలా పార్కు నుండి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ




**మట్టెవాడ, జూలై 01 (పీపుల్స్ డైరీ):** పేదల ఇళ్ళ స్థలాలకు పట్టాల సాధన కోసం వామపక్షాలు చేపట్టిన పికెటింగ్ తో వరంగల్ కలెక్టరేట్ దద్దరిల్లింది. వామపక్షాల రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు బుధవారం వరంగల్ కలెక్టర్ కార్యాలయం ఎదుట భారీ ఎత్తున పికెటింగ్ నిర్వహించారు. తొలుత సిపిఐ, సిపిఎం, ఎంసిపిఐ(యూ), సిపిఐ ఎంఎల్ న్యూడెమక్రసి, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీల ఆధ్వర్యంలో హనుమకొండ ఏకశిలా పార్కు నుండి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన వామపక్షాల నాయకులు, కార్యకర్తలు కలెక్టర్ బయటికి రావాలని, పేదలకు పట్టాలు ఇవ్వాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ భాషుమియా, సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్.రంగయ్య, ఎంసిపిఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు గంగుల దయాకర్, లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి యాదగిరి మాట్లాడుతూ పేదల ఇళ్ళ స్థలాలకు పట్టాలు సాధించే వరకు విశ్రమించేది లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నిరుపేదలందరికీ ఇళ్ళ పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ప్రభుత్వ భూములలో పేదలు భూ పోరాటాలను నిర్వహించి ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్నారని అన్నారు. ప్రభుత్వ భూములను భూ కబ్జాదారుల నుండి, రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుండి కాపాడుతున్నది వామపక్షాలేనని అన్నారు. ప్రభుత్వ అధికారులు భూ కబ్జాదారులకు వంత పాడుతూ పేదలపై ప్రతాపం చూపుతున్నారని అన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా పేదల కోసం నిలబడుతామని, భూ పోరాటాలను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ నెల 6న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ పికెటింగ్ లో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండు లక్ష్మణ్, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రి, నాయకులు బుస్సా రవీందర్, సంగి ఏలేందర్, గుండె బద్రి, కందిక చెన్నకేశవులు, ల్యాదెళ్ల శరత్, చింతకింది కుమారస్వామి, సిపిఎం జిల్లా నాయకులు సింగారపు బాబు, నలిగంటి రత్నమాల, ఆరూరి కుమార్, ఎంసిపిఐ(యూ) నాయకులు మాలోతు సాగర్, నర్రా ప్రతాప్, ముక్కెర రామస్వామి, కన్నం వెంకన్న, సంధ్య, వనపాక ఓదెలు, న్యూ డెమోక్రసీ నాయకులు రాచర్ల బాలరాజు, సిపిఐ నాయకులు ఎండి.అక్బర్, ఓర్సు రాజు, తాళ్లపల్లి జాన్ పాల్, సాంబమూర్తి, యాకాంబ్రాచారి, సుధీర్, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.



## కృషి గాయత్రి పాఠశాలలో డాక్టర్స్ డే వేడుకలు

**కేసముద్రం, జూలై 1 (పీపుల్స్ డై) :** స్థానిక కృషి గాయత్రి పాఠశాలలో డాక్టర్స్ డే కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు సాయిదీపిక, ఆఫీఫా, గౌతమ్, రాంచరణ్ పాల్గొని వైద్యుల సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మోడెం రవీందర్ గౌడ్ మాట్లాడుతూ వైద్యులు దేవునితో సమాన మని, ప్రాణాలు కాపాడే వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని అన్నారు. సమాజంలో వైద్యుల పాత్ర చాలా గొప్పదని, విద్యార్థులు వైద్యులను ఆదర్శంగా తీసుకొని సమాజ సేవ చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శోభారాణి, రాకేష్, స్పందన, కవిత తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు డాక్టర్స్ డే సందర్భంగా వైద్యుల త్యాగాలను, సేవలను వివరిస్తూ ప్రసంగించారు. వైద్యులకు కృతజ్ఞతలు తెలుపుతూ పాటలు, నృత్యాలు ప్రదర్శించారు.

## కుమ్మరికుంట తండాలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం




**మహబూబాబాద్, జూలై 1 (పీపుల్స్ డైరీ) :** మహబూబాబాద్ మున్సిపాలిటీ 10వ వార్డు కుమ్మరికుంట తండాలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మురళి నాయక్ పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణలో రేవంత్ సర్కార్ ఏర్పడ్డాక బడుగు బలహీన వర్గాల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని అన్నారు. ఇల్లు లేని ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించడమే రేవంత్ సర్కార్ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు అందేలా చర్యలు తీసుకున్నామని, అసలైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు లేని ఊరు లేకుండా చేస్తానని హామీ ఇచ్చారు. అంతేకాకుండా పేదల కోసం సన్న బియ్యాన్ని ఇస్తున్న సర్కార్ రేవంత్ సర్కార్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి బొమ్మరాజు కుమారస్వామి, 10వ వార్డు ఇంచార్జి భూక్యా శ్రీను, 9వ వార్డు మాజీ కౌన్సిలర్ హరిసింగ్ నాయక్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# "రోజూ రండి.. లేదంటే కొత్త డాక్టర్‌ను పంపండి!"

## చిన్న జబ్బుకు పది కిలోమీటర్లు పయనం - ఆయుర్వేద వైద్యురాలి తీరుపై చిన్న ముప్పారం వాసుల ఆగ్రహం

**కేసముద్రం, జూలై 1 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని చిన్న ముప్పారం గ్రామంలో గల ఆయుర్వేద వైద్యశాలకు వైద్యురాలు నియమితులై ఉన్నా సరిగా రాకపోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారంలో ఒకటి రెండు రోజులు మాత్రమే వైద్యురాలు వస్తుండగా మిగతా రోజులు వైద్యశాలకు తాళం వేసి ఉంటోంది. వచ్చిన రోజు కూడా ఉదయం 11 గంటలకు వచ్చి మధ్యాహ్నం 1 గంటకే వెళ్లిపోతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. దీంతో జ్వరం, దగ్గు, కీళ్ల నొప్పులు, చర్మవ్యాధుల వంటి చిన్న చిన్న జబ్బులకు కూడా ప్రజలు 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రానికి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ముఖ్యంగా రోజూ వైద్యం అవసరమైన వృద్ధులు, మహిళలు, పేద ప్రజలు బస్సుల్లో వెళ్లలేక, ప్రైవేటు వైద్యం భరించలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ వైద్యం అందక ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లి వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియమిత వైద్యురాలు ప్రతిరోజూ సమయానికి వైద్యశాలకు వచ్చి సేవలు అందించాలని, లేకుంటే కొత్త వైద్యుడిని నియమించాలని గ్రామ ప్రజలు ప్రభుత్వాన్ని, వైద్య శాఖ అధికారులను కోరుతున్నారు. వెంటనే చర్యలు తీసుకోకపోతే వైద్యశాల ఎదుట ఆందోళన చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు.




## ప్రముఖ వైద్యుడు డాక్టర్ సత్యనారాయణకు సన్మానం

### సత్కరించిన టి.జి.ఎస్ రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర



**హైదరాబాద్, జూలై 1 (పీపుల్స్ డైరీ) :** జాతీయ వైద్యుల దినోత్సవం పురస్కరించుకొని ముషీరాబాద్‌కు చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ జీజుల సత్యనారాయణ గంగపుత్రను తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర శాలు వాతో ఘనంగా సత్కరించి జాతీయ వైద్యుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర మాట్లాడుతూ నిరుపేద గంగపుత్రులకు వయోవృద్ధుల కొరకు ప్రత్యేకంగా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఉచిత వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తూ గంగపుత్రుల అభ్యున్నతికి తోడ్పాటు అందించాలని డాక్టర్ జీజుల సత్యనారాయణ గంగపుత్రను ఆయన కోరారు.

## యువ వికాసం నిధులు మంజూరు చేయాలి



**చిట్యాల, జులై 1 (పీపుల్స్ డైరీ) :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం కింద ఎంపికైన లబ్ధిదారుల పేర్లు ప్రకటించి లబ్ధిదారులకు నిధులు మంజూరు చేయాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జయశంకర్ భూపా లపల్లి జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేష్ బుధవా రం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించడానికి రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా రూ. 50 వేల నుండి రూ. 4 లక్షల వరకు రుణాలు అందిస్తామ ని చెప్పి రూ. 6వేల కోట్లను కేటాయించడం జరి గిందని ప్రభుత్వం ప్రకటించడం జరిగిందన్నారు. ఈ పథకానికి రాష్ట్రంలోని నిరుద్యోగులు అర్హులు 16 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని రాష్ట్ర అవతరణ దినోత్సవం గత జూన్ 2న లబ్ధిదా రులకు నిధులు మంజూరు చేస్తామని రుణాల మంజూరు పత్రాల ను అందిస్తామని ఇంతవరకు వారికి మంజూరు పత్రాలనుఅందించకపోవడం సరైంది కాదన్నారు.

## కేసముద్రంలో విత్తన, ఎరువుల దుకాణాల తనిఖీ



**కేసముద్రం, జూలై 1 (పీపుల్స్ డైరీ) :** కేసముద్రం మండలం లోని పలు విత్తన, ఎరువుల దుకాణాలను మహబూబాబాద్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు అజ్మీర శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి బి వెంకన్న తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా విత్తన, ఎరువుల దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలు, ఇన్వాయిసులు, పీఓఎస్ మిషన్ నిల్వలు, గోదాము నిల్వలు, స్టాక్ బోర్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అదేవిధంగా రైతులకు ప్రభుత్వం బోనస్ ప్రకటించిన ఏడు రకాల వరి సన్నధాన్యాలపై దుకాణదారుల కు, రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రతి ఎరువుల డీలరు రైతులకు తప్పనిసరిగా విత్తన ఎరువుల బిల్లులు ఇవ్వాలని, రైతులు కూడా బిల్లు తీసుకొని పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపర చుకోవాలని సూచించారు. డీలర్లు ఎరువుల స్టాక్ రిజిస్టర్ నిల్వలు, పీఓఎస్ నిల్వలు, గోదాం నిల్వలు సమానంగా ఉండే లా చూసుకోవాలని చెప్పారు. ప్రతి ఎరువుల డీలరు ఎరువుల కంపెనీకి సంబంధించిన ఓ ఫామ్‌లను ఎరువుల లైసెన్స్‌లో పొందుపరచుకోవాలని, కొత్తగా గోదాములు తీసుకుంటే వాటి ని కూడా లైసెన్స్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఆదేశించారు. డీలర్లు కనీస మద్దతు ధరకు మాత్రమే ఎరువులు విక్రయించాలని, ఎవరైనా అధిక ధరలకు విక్రయిస్తే ఎరువుల నియంత్రణ చట్టం 1985, నిత్యావసర వస్తువుల చట్టం 1955 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు మోసపోకుండా బిల్లు తీసుకోవాలని, అనుమానం వస్తే వ్యవసాయ శాఖకు ఫిర్యాదు చేయాలని కోరారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 18 మందికి జరిమాన

**మట్టెవాడ, జూలై 01 (పీపుల్స్ డైరీ):** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 18 మందినిని కోర్టులో హాజరు పరచగా వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అంకేశ్వరపు కమలాకర్ రూ.16,500/- జరిమాన విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సిఐ కోడూరి సుజాత తెలిపారు. అదేవిధంగా లైసెన్స్ లేకుండా వాహనం నడిపి పట్టుబడ్డ ఐదుగురు వాహనదారులకు వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రూ.2,000 జరిమాన విధించినట్లు సీఐ సుజాత వెల్లడించారు.

## రాజ్యాధికార సమరభేరి మహాసభను విజయవంతం చేద్దాం : బోనగిరి రాజేష్



**మొగుళ్ళపల్లి, జూలై 1 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని తెలంగాణ రాజ్య అధికార పార్టీ మొగుళ్లపల్లి మండల అధ్యక్షుడు బోనగిరి రాజేష్ ఆధ్వర్యంలో. జూలై 5న భువనగిరిలో జరగనున్న రాజ్యాధికార సమరభేరి మహాసభను ప్రజలందరూ విజయవంతం చేయాలని అన్నారు. గుండ్ల కర్తి, కాసులపాడు, వేములపల్లి, నర్సింగాపూర్, మెట్టుపల్లి, గ్రామాలలో మండల అధ్యక్షుడు భువనగిరి రాజేష్ మహాసభ ఆహ్వాన పత్రికలను గ్రామస్తులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన హక్కుల సాధన కోసం మన ఆత్మగౌరవ రక్షణ కోసం. జులై 5న భువనగిరి గడ్డపై నిర్వహించబడనున్న చారిత్రాత్మక "రాజ్యాధికార సమరభేరి" మహాసభను విజయవంతం చేద్దామని బీసీ, ఎస్సీ, ఎస్టీ సోదర సోదరీమణులు, యువతీ యువకులు, మేధావులు, విద్యార్థులు ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరూ. భారీ సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు టిఆర్పి నాయకులు పాల్గొన్నారు.

# కేసముద్రంలో ఎస్ఐఆర్, సభ్యత్వ నమోదు అవగాహన సదస్సు



**కేసముద్రం, జూలై 1 (పీపుల్స్ డైరీ) :** మహబూబాబాద్ నియోజకవర్గంలోని కేసముద్రం మండల కేంద్రంలో ఎస్ఐఆర్, సభ్యత్వ నమోదు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహబూబాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఉద్యమంలా నిర్వహించాలని పిలుపుని చ్చారు. ప్రతి బూత్ పరిధిలో అర్హులైన ప్రతి ఒక్కరిని పార్టీ సభ్యత్వంలో చేర్చేలా కార్యాచరణ చేపట్టాల ని సూచించారు. సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతం గా, పారదర్శకంగా పూర్తి చేయడానికి బీఎల్ఏలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఎస్ఐఆర్ కార్యక్రమంపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించి అర్హులైన ప్రతి ఒక్కరూ నమోదు చేసుకునేలా కృషి చేయాలని తెలిపారు. సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్ కార్యక్రమంలో మహబూబాబాద్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గం గా నిలిపేలా ప్రతి నాయకుడు, కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని అన్నారు. బూత్ కన్వీనర్లు, సభ్యత్వ నమోదు ఇన్‌చార్జిలు గ్రామ సర్పంచ్‌లు, సర్పంచ్ అభ్యర్థులు, సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, సహకార సంఘాల డైరెక్టర్లు, వార్డు సభ్యులకు అండ గా నిలిచి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రావుల రవిచంద్ర రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రావుల శ్రీనాథ్ రెడ్డి, కౌన్సిలర్ హరి వినయ్ ప్రెసిడెంట్లు మొహమ్మద్ నజీర్ అహ్మద్, మాజీ మండల ప్రధాన కార్యదర్శి కముటం శ్రీనివాస్, మాజీ టౌన్ అధ్యక్షులు వీరు నాయక్, కాట్రపల్లి మాజీ సర్పంచ్ సైదమ్మ రవీందర్ షేక్ జానీ మోడెం రాజు జానీ ఆటో పార్టీ నాయకులు బీఎల్ఏలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన సీతారాంపురం సర్పంచ్



**గణపురం, జూలై 1 (పీపుల్స్ డైరీ) :** గణపురం మండలంలోని సీతారాంపురం బిఆర్ఎస్ పార్టీ సర్పంచి తోట రాకేష్, బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భం గా రాకేష్ మాట్లాడుతూ... భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితునై సీతారాంపురం గ్రామపంచాయతీ అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ఆయన తెలిపారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మార్నేని ఉపేందర్ రావు, సీతారాంపురం గ్రామ కమిటీ అధ్యక్షులు పీట్ల రంజిత్, గొట్టిముక్కుల శ్రీనివాస రావు, మేకల పూర్ణచందర్, ఇనుముల రాజు, ఇనుముల నీలయ్య, బోదాసు సంపత్, కోట కృష్ణ, రామంచ కిరణ్, బొల్లం జంపయ్య, పెరుమల నరసయ్య, సలుపాల రవిపాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

## బీఎల్‌వోల ఇంటింటి ఫారాల పంపిణీని పరిశీలించిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్





**మహబూబాబాద్, జూలై 1 (పీపుల్స్ డైరీ) :** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఓటరికి అవకాశం కల్పించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అధికారులను ఆదేశించారు. బుధవారం మహబూబాబాద్ పట్టణంలోని కంబాలపల్లి గ్రామంలో బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఎస్ఐఆర్ ఫారాలను పంపిణీ చేస్తున్న విధానాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలు ఓటర్లకు ఫారాల పంపిణీ, వివరాల నమోదు, అవగాహన కల్పన తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ఓటర్లకు ఫారాలను అందజేయాలని, ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనల ప్రకారం పని చేయాలని అన్నారు. ఓటర్ల నుంచి అందిన ఫారాలను నిర్ణీత గడువులోగా స్వీకరించి, వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు కూడా ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొని సరైన సమాచారం అందించాలని కోరారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసే కీలక ప్రక్రియ అని పేర్కొన్న కలెక్టర్, అధికారులు, బీఎల్‌వోలు పూర్తి బాధ్యతతో విధులు నిర్వహించాల ని సూచించారు. అలాగే బుధవారం మహబూబాబాద్ పట్టణంలోని 35 వార్డులో ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు, స్థానిక శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్, లకు సిబ్బంది ఫారాల అందజేశారు. జిల్లా వ్యాప్తంగా పక్కా ప్రణాళికతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని షెడ్యూలు ప్రకారం అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశాలు నిర్వహించి పూర్తి సమాచారం అందించడం జరుగుతుందని, క్షేత్రస్థాయిలో సోషల్ మీడియా వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పించడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో మహబూబాబాద్ ఏఈఆర్ఓ కట్టంచంద్ర రాజేశ్వర్ రావు, బిఎల్ఓ సూపర్వైజర్ జి.కవిత, బిఎల్వో పి.కనక లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## ఆపరేషన్ రోప్' షురూ..

### రోడ్లపై ఆక్రమణలు తొలిగింపు



**కోదాడ, జూలై 1 (పీపుల్స్ డైరీ) :** కోదాడ పట్టణ కేంద్రంలో రోజురో జుకూ పెరుగుతున్న ట్రాఫిక్ ఇబ్బందులను అదుపు చేయడానికి కోదాడ ట్రాఫిక్ పోలీసులు చర్యలు వేగవంతం చేశారు. ఇందులో భాగంగా పట్టణంలోని అత్యంత రద్దీగా ఉండే రంగా థియేటర్ నుండి శ్రీనివాస థియేటర్ వరకు ఉన్న ప్రధాన రహదారిపై బుధవారం 'ఆపరేషన్ రోప్' ప్రత్యేక డ్రైవ్‌ను ముమ్మరంగా నిర్వహించారు. ప్రధాన రహదారులపై ఈ తనిఖీలు చేపట్టారు. రహదారులను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న దుకాణదారుల సామాగ్రిని, తోపుడు బండ్లను మరియు ఫుట్‌పాత్‌లపై అక్రమంగా ఏర్పాటు చేసిన బోర్డులను తొలగించారు. క్షేత్రస్థాయిలో రంగంలోకి దిగిన ట్రాఫిక్ ఎస్ఐ కోదాడ ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా పట్టణంలోని స్వయంగా సిబ్బందితో కలిసి రోడ్డుపైకి వచ్చి తనిఖీలు చేపట్టారు. ఈ మార్గంలో రోడ్డును ఆక్ర మించి ఫుట్‌పాత్‌లపై ఉంచిన కిరాణా సామాగ్రి, బస్తాలు, దుకాణాల బోర్డులు మరియు తోపుడు బండ్లను పోలీసులు దగ్గరుండి తొలగించా రు. వ్యాపారస్తులు రోడ్డు మార్జిన్‌ను దాటి వస్తువులను ప్రదర్శించ వద్దని క్షేత్రస్థాయిలో హెచ్చరించారు. లివ్యాపారస్తులు సహకరించాలి: ట్రాఫిక్ ఎస్ఐ హెచ్చరిక ట్రాఫిక్ ఎస్ఐ మాట్లాడుతూ, వ్యాపారులు ఎవరూ రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేయవద్దని, ఇది అందరి భద్రతకు సంబంధించిన విషయమని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే మొదటిసారి జరిమానా విధిస్తామని, పదే పదే తప్పు చేస్తే చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పట్టణ ప్రజలు, వాహనదారులు, స్థానిక వ్యాపారస్తులు ఈ 'ఆపరేషన్ రోప్' కార్యక్రమానికి పూర్తి స్థాయిలో సహకరించి కోదాడను ట్రాఫిక్ రహిత పట్టణంగా మార్చాలని ఆయన పిలుపునిచ్చారు.

## సర్‌పై సందేహాల నివృత్తికి రాజకీయ పార్టీలతో కలెక్టర్ సమావేశం

**మహబూబాబాద్, జూలై 1 (పీపుల్స్ డైరీ) :** బుధవారం జిల్లా కలెక్టరేట్ లోని వి.సి. హాలులో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం అమలుపై వివిధ రాజకీయ పార్టీలకు ఉన్న సందేహాలను నివృత్తి చేసేందుకు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి స్నేహ శబరిష్ అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ SIR-2026 కార్యక్రమం షెడ్యూల్, ఇంటింటి సర్వే, ఫారాల స్వీకరణ, క్లెయిమ్స్ డ అబ్జెక్షన్ల ప్రక్రియపై పార్టీల నాయకులు లేవనెత్తిన అంశాలకు కలెక్టర్ సవివరంగా సమాధానం ఇచ్చారు. ఓటర్ల జాబితా ప్రక్షాళన ప్రక్రియ విజయవంతం కావడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పిస్తూ సహకరిం చాలని కోరారు. 2002 ఓటర్ల జాబితా ఆధారంగా కుటుంబ సభ్యుల వివరాలను ధృవీకరించి నమోదు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలు ఎలా నింపాలో వివరించే ట్యుటోరియల్ వీడియోలను సిద్ధం చేశామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి సందేహానికి సమాధానం ఇవ్వబడుతుందని తెలిపారు. దోషరహిత ఓటరు జాబితా రూపకల్పనకు అన్ని రాజకీయ పార్టీల సహకారం తప్పనిసరి. సందేహాలుంటే నేరుగా నా దృష్టికి గానీ, ఈఆర్వో దృష్టికి గానీ తీసుకురావాలి" అని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో రెవెన్యు అదనపు కలెక్టర్ కె.అనిల్



కుమార్, పరిపాలన అధికారి పవన్ కుమార్, భారతీయ జనతా పార్టీ నుండి వేముల కోమల్ వెంకట్ రెడ్డి, శ్యాం సుందర్ శర్మ, సీతారాం నాయక్, కాంగ్రెస్ పార్టీ నుండి సురేష్ నాయుడు, బిఆర్ఎస్ పార్టీ నుండి మార్నేని వెంకన్న, బిఎస్‌పి పార్టీ నుండి విజయకాంత్, టి.డిపి నుండి రామారావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు వరం సీఎం సహాయనిధి : ఎమ్మెల్యే



**చిట్యాల, జులై 1(పీపుల్స్ డైరీ) :** భూపాలపల్లి నియోజకవర్గం లోని చిట్యాల మొగుళ్లపల్లి టేకుమట్ల మండలాల్లోనీ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు వరంగా అండగా నిలుస్తుందని వైద్యం పొందిన రోగులు అప్పుల పాలు కాకుండా సీఎంఆర్ఎఫ్ తోడ్పాటున అందిస్తుంది అన్నా రు. చిట్యాల మండలంలోని 26 మొగుళ్లపల్లి మండలంలోనీ 30 టేకుమట్ల మండలంలోని 21చెక్కులు మొత్తం 77 చెక్కులను రూ. 22,36,500 రూపాయల చెక్కులను లబ్ధిదారులకు అందచేశారు. పేద ప్రజలకు అవసరమైన సమయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు ఎల్ఓసీలను ఎప్పటికప్పుడు అందించేందు కు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. వైద్య చికిత్స అవసరమైన ప్రతి పేద కుటుంబం తనను సంప్రదించి ప్రభుత్వ పథకాల ద్వారా అవసరమైన సహాయం పొందాలని సూచిం చారు. భూపాలపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఎంఆర్ఐ సీటీ స్కాన్ వంటి ఆధునిక సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువచ్చామని పరిశుభ్రతతో పాటు సేవల నాణ్యతను మరింత మెరుగుపరిచేం దుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ మండల అధ్యక్షులు,సర్పంచ్‌లు ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నేతలు మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## గ్రామీణులకు బ్యాంకింగ్ సేవలపై అవగాహన




**గణపురం, జూలై 01 (పీపుల్స్ డైరీ) :** గ్రామీణ ప్రజలు బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని వరంగల్ డీసీసీ బ్యాంక్ గణపురం (ములుగు) శాఖ మేనేజర్ అజ్మీర జ్యోతిబసు సూచించారు. బుధవారం మండలంలోని చెల్పూర్ శివారు వీరయ్యపల్లి గ్రామంలో చెల్పూర్ సహకార సంఘం ఆధ్వర్యంలో, నాబార్డ్ ఆర్థిక సహకారంతో నిర్వహించిన ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి కుటుంబానికి బ్యాంకు ఖాతా ఉండాలని, చిన్న మొత్తాలైనా క్రమం తప్పకుండా పొదుపు చేయడం ద్వారా భవిష్యత్ అవసరాలకు ఆర్థిక భరోసా ఏర్పడుతుందని తెలిపారు. ఫిక్స్ డిపాజిట్లతో పాటు ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన వంటి కేంద్ర ప్రభుత్వ బీమా పథకాల ప్రయోజనాలను వివరించారు. అలాగే కేవైసీ, రీ-కేవైసీ ప్రక్రియలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో పూర్తి చేసుకోవాలని సూచించారు. బ్యాంకు ద్వారా రైతులు, మహిళా సంఘాలు, చిన్న వ్యాపారులు, స్వయం ఉపాధి పొందే వారికి అందుబాటులో ఉన్న వివిధ రకాల రుణ పథకాల గురించి కూడా అవగాహన కల్పించారు. అనంతరం కళాజాతా బృందం ఆటలు, పాటలు, ఇంద్రజాల ప్రదర్శనల ద్వారా బ్యాంకింగ్ సేవలు, పొదుపు అలవాట్లు, బీమా పథకాల ప్రాధాన్యతను వినూత్నంగా వివరించి గ్రామస్తులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి చెల్పూర్ సొసైటీ డైరెక్టర్ రాజన్న, బాబూరావు, కార్యదర్శి సూర రవీందర్, ఫీల్డ్ అసిస్టెంట్ రాజేశ్వర్, బ్యాంక్ సిబ్బంది రంజిత్ కుమార్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## వి.బి.రాంజి తీర్మానాన్ని వెంటనే రద్ద చేయాలి

**గోవిందరావుపేట, జులై 1(పీపుల్స్ డైరీ) :** వి.బి.రాంజీ తీర్మానాన్ని రద్దుచేసి మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని యధాతథంగా కొనసాగించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వం తీసుకొచ్చిన వి.బి.రామ్‌జి నిర్మాణాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రజల నిర్దేశించి ఉద్దేశించి సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సోమ మల్లారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పొదిళ్ల చిట్టిబాబు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తీగల ఆదిరెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ పేదలు, వ్యవసాయ కార్మికులు, మహిళలు, దళితులు, ఆదివాసీల జీవనాధారమైన ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాలను ప్రజలు ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామీణ కుటుంబానికి 200 రోజుల చట్టబద్ధ ఉపాధి కల్పించాలి. అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వమే పూర్తిగా భరించాలి సిఐటి నాయకులు డిమాండ్ చేశారు,పలు డిమాండ్లతో కూడిన విజ్ఞాపన పత్రాన్ని స్థానిక తాసిల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో గొంది రాజేష్, గుండు లెనిన్, ఖ్యాతం సూర్యనారాయణ, కోటె కృష్ణారావు, కాప కోటేశ్వరరావు, శ్రీ రామోజు సువర్ణ, నిమ్మకంటి స్రవంతి, ఊకే సమ్మక్క మడకం రాజు, మాడివి దినేష్, నిమ్మల బిక్షం, వంక నాగేష్, ఐలయ్య తదితర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న సీఐటీయు నాయకులు




## లేబర్ కోడ్‌ల రద్దుకు కార్మిక సంఘాల నిరసన

**ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం) జూలై 1 (పీపుల్స్ డైరీ) :** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, 12వ జేబీసీసీఐ (వేతన కమిటీ)ని వెంటనే ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, హెచ్ఎంఎస్ జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఇల్లందు సింగరేణి వర్క్‌షాప్ వద్ద కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. అనంతరం డీవైఎస్ కల్వోటి కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో జేఏసీ నాయకులు నజీర్ అహ్మద్, అబ్దుల్ నబీ, ఎల్. మధు, బాల ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలు గు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో నాలుగు లేబర్ కోడ్‌లను తెలంగాణలో అమలు చేయబోమని తీర్మానం చేయాలని కోరారు. తెలంగాణలోని బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించేలా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జూన్ 30తో 11వ వేతన బోర్డు గడువు ముగిసిన నేపథ్యంలో 12వ జేబీసీసీఐ సమావేశాన్ని తక్షణమే నిర్వహించి వేతన సవరణ ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఇల్లందు ప్రాంత అభివృద్ధి, మనుగడ కోసం పూసపల్లి ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టును వెంటనే ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జక్కుల శ్రీనివాస్, అబ్బాస్‌తో పాటు పెద్ద సంఖ్యలో సింగరేణి కార్మికులు పాల్గొన్నారు.

## డాక్టర్ల సేవలు సమాజానికి అమూల్యం

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

**గణపురం, జూలై 1 (పీపుల్స్ డైరీ) :** సమాజానికి వైద్యులు అందిస్తున్న సేవలు అమూల్యమైనవని, ప్రజల ప్రాణాలను కాపాడే వైద్యులు దేవుళ్లతో సమానమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం మండలంలోని చెల్పూర్ గ్రామ పరిధిలోని జిల్లా మెడికల్ కళాశాలలో డాక్టర్స్ డే సందర్భంగా మెడికో పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజల ఆరోగ్య పరిర క్షణ కోసం వైద్యులు రాత్రింబవళ్లు అంకితభావంతో సేవలందిస్తూ సమాజానికి ఎనలేని సేవ చేస్తున్నారని కొనియాడారు. వైద్య వృత్తి అత్యంత గౌరవప్రదమైనదని, సేవాభావంతో పనిచేసే వైద్యుల వల్లే సమాజం ఆరోగ్యవంతంగా ముందుకు సాగుతోందన్నారు. ప్రస్తుతం వైద్య విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు సేవా దృక్పథంతో ముందుకు సాగి పేద ప్రజలకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం మెడికో పేరెంట్స్ అసోసియేషన్ రూపొందించిన నూతన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల అధ్యాపకులు, వైద్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# అర్హులైన ప్రతిఒక్కరు ఓటరు జాబితాలో ఉండాలి

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను క్షేత్ర స్థాయిలో తనిఖీ చేసిన అదనపు సీఈవో



**ఖమ్మం, జులై 1 (పీపుల్స్ డైరీ) :** అర్హులైన ప్రతిఒక్కరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అదనపు ప్రధాన ఎన్నికల అధికారి వాసం వెంకటేశ్వర రెడ్డి తెలిపారు. జిల్లాలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను అదనపు సీఈవో, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. ఈ.శ్రీజ తో కలిసి క్షేత్ర స్థాయిలో తనిఖీ చేశారు. బుధవారం కూసుమంచి మండలం జుజ్జుల్ రావుపేట, కొనిజర్ల మండలం తనికెళ్ళ, వైరా మండలం కేజీ సిరిపురం గ్రామాల్లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ సరళిని అదనపు సిఇఓ పరిశీలించారు. ఈ సందర్భంగా పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించిన అదనపు సీఈవో, బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు), సూపర్వైజర్ల పనితీరును పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాల సేకరణ, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, ధ్రువీకరణ ప్రక్రియ, అవసరమైన పత్రాల పరిశీలన తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా, దోషరహితంగా రూపొందిం చడమే లక్ష్యంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా ప్రతి అర్హుడైన ఓటరును జాబితాలో నమోదు చేయడంతో పాటు, మరణించినవారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు, డూప్లికేట్ నమోదులను నిబంధనల ప్రకారం తొలగించాలని అధికారులకు సూచించారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి, ఓటర్లకు అవసరమైన అవగాహన కల్పించాలని, ఫారాల నింపడంలో సహకరించాలని అదనపు సిఇఓ అన్నారు. బీఎల్‌వోలు ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు నిష్పాక్షికంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఓటరు జాబితా నాణ్యతను మెరుగుపరచడంలో ఎస్ఐఆర్ కీలకమని, ఈ ప్రక్రియను సమయపాలనతో పూర్తి చేయాలని అన్నారు. అదనపు సిఇఓ తనిఖీ సందర్భంగా మండల తహశీల్దార్లు, బిఎల్ఓ లు, అధికారులు, తదితరులు ఉన్నారు.



## నాణ్యమైన విద్య అందించేందుకు కృషిచేయాలి

**పినపాక, జూలై 1(పీపుల్స్ డైరీ) :** పినపాక మండలం భూపాలపట్నం గ్రామపంచాయతీ పరిధిలోని ప్రాథమిక పాఠశాలను సర్పంచ్ తొలేం స్వప్న, ఉప సర్పంచ్ నిట్ట శిరీష బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకుని, పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, గ్రామంలోని తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి అరుణశ్రీ, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## నాటు సారా అమ్మకాల పట్ల నిషేధం

### వట్టం వారి గుంపులో తీర్మానం



**కరకగూడెం, జూలై 1(పీపుల్స్ డైరీ) :** మండలంలోని వట్టం వారి గుంపు పంచాయతీలో నాటు సారా అమ్మకాలను పూర్తిగా నిషేధిస్తూ తీర్మానం చేశారు. సర్పంచ్ వట్టం సందీప్ వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు సమక్షంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. నాటు సారా వల్ల కుటుంబాలు నాశనం అవుతున్నాయని, యువత చెడుదారి పడుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. తీర్మానం ఉల్లంఘించిన వారిపై గ్రామ కట్టుబాటు ప్రకారం జరిమానా విధిస్తామని హెచ్చరించారు. నాటు సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని అందరూ ప్రతిజ్ఞ చేశారు.





## 'చిన్నారులే వైద్యులైన వేళ'

### స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం

**ఖమ్మం, జులై 1 (పీపుల్స్ డైరీ) :** వైద్యాన్ని మహా యజ్ఞంగా భావించి తన వద్దకి వచ్చిన ప్రతి ప్రాణాన్ని కంటికి రెప్పలా కాచుకునే ప్రత్యక్ష దైవం వైద్యుడే అని స్మార్ట్ కిడ్జ్ పాఠశాల కరెస్పాండంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య అన్నారు. బుధవారం జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా స్మార్ట్ కిడ్జ్ చిన్నారులు పలు స్కిట్‌లు ప్రదర్శించి, మానవ జీవితంలో వైద్య వృత్తి గొప్పతనాన్ని చాటి చెప్పారు. ఉపాధ్యాయులు చిన్నారులకి వైద్యులు ఎంత విలువైన వారు అనేది వివరించారు. అనంతరం స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలోని పేరెంట్స్, వైద్య వృత్తిలో రాణిస్తూ, రోగులకు విశేష సేవలు అందిస్తున్న పలువురు వైద్యులకి మెమెంటోలతో సత్కరించారు.

## పర్యావరణ సమతుల్యతను కాపాడాలి : టౌన్ ఏసీపీ



**ఖమ్మం, జులై 1 (పీపుల్స్ డైరీ) :** పర్యావరణ సమతుల్యతను కాపాడటానికి అందరూ భాగస్వామ్యం కావాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పచ్చదనం పెంపొందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా నగరంలోని డా, బిఆర్. అంబేద్కర్ మహిళ జూని యర్ కాలేజ్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ విద్యార్థులతో కలసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పోలీస్ కమి షనర్ మాట్లాడుతూ నాటిన మొక్కలను సంరక్షిం చుకునేందుకు ప్రజలంతా సమష్టిగా కృషి చేయాలని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ, అడవుల విస్తరణ, చెట్ల ఆవశ్యకతపై ప్రజలలో అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఖాళీ స్థలాలు, రోడ్లకిరువైపులా సామూహికంగా మొక్కలు నాటే డ్రైవ్‌లు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఖమ్మం టౌన్ ఏసీపీ రమణమూర్తి, కాలేజ్ ప్రిన్సిపాల్ యం. రాజలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ డా,బి. కనకవల్లి, ఇన్స్పె క్టర్ కరుణాకర్, బాలకృష్ణ, భానుప్రకాష్ పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఓటరికి ఫారం చేరేలా ప్రత్యేక చర్యలు


### సర్వే పురోగతి నివేదికను ఎమ్మెల్యే పాయంకు అందజేసిన సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్..



**కరకగూడెం, జూలై 1 (పీపుల్స్ డైరీ) :** రాష్ట్రంలో కొనసాగుతున్న సర్ కార్యక్రమంలో భాగంగా కరకగూడెం మండలంలో జరుగుతున్న ఓటరు నమోదు సర్వే పురోగతికి సంబంధించిన రోజువారీ నివేదికను నేడు మణుగూరు క్యాంపు కార్యాలయంలో పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లుకి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ అందజేశారు. ఈ సందర్భంగా మండలంలోని 16 పోలింగ్ బూత్‌లలో సర్వే పురోగతి, ఫారాల పంపిణీ స్థితి, పెండింగ్ వివరాలు, అర్హులైన ప్రతి ఓటరికి ఫారం అందేలా చేపడు తున్న చర్యలపై ఎమ్మెల్యేకి వివరించారు. సర్వే ప్రక్రియను మరింత వేగవంతం చేసి, ప్రతి అర్హుడైన ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు, బిఎల్ఏలు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించినట్లు తెలిపారు..

## 14వ వార్డులో కాంగ్రెస్ వార్డు కమిటీ సమావేశం

**ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం) జూలై 1 (పీపుల్స్ డైరీ) :** కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతంలో భాగంగా ఇల్లందు పట్టణంలోని 14వ వార్డులో కాంగ్రెస్ పార్టీ వార్డు కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు మడుగు సాంబమూర్తి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంలో వార్డు కమిటీల పాత్ర కీలకమని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంతో పాటు సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. పార్టీ కార్యకర్తలు ప్రజలతో నిరంతరం మమేకమై కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. రానున్న కార్యక్రమాలను విజయవంతం చేయడానికి అందరూ సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు బోళ్ళ సూర్యం, మాజీ అధ్యక్షులు దొడ్డ డానియల్, 20వ వార్డు కౌన్సిలర్ జాఫర్, వార్డు నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## వీబీజీ రామ్‌జీ చట్టాన్ని రద్దు చేయాలి





**ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం) జూలై 1( పీపుల్స్ డైరీ) :** వీబీజీ రామ్‌జీ చట్టాన్ని రద్దు చేసి పాత జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ, తెలంగాణ వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం, తెలంగాణ రైతు సంఘాల ఆధ్వర్యంలో సీఎస్పీ గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యదర్శి షర్మిళకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా తాళ్లూరి కృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో సీఐటీయూ, తెలంగాణ వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జిల్లా నాయకులు అబ్దుల్ నబీ, ఆలేటి కిరణ్ కుమార్ మాట్లాడుతూ, వీబీజీ రామ్‌జీ చట్టాన్ని వెంటనే రద్దు చేసి పాత జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనుల్లో అమలు చేస్తున్న ముఖ ఆధారిత హాజరు, రోజుకు రెండు పూటల ఫోటోలు తీసే విధానాన్ని రద్దు చేయాలని, కూలీలకు అవసరమైన పనిముట్లు ఉచితంగా అందించాలని, పని ప్రదేశాల్లో తాగునీరు, టెంటు, ప్రథమ చికిత్స కిట్ వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. అలాగే, పని పూర్తయిన 15 రోజుల్లోపు కూలి చెల్లించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా రోజువారీ కూలీని రూ.600కు పెంచడంతో పాటు సంవత్సరానికి 200 రోజుల ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శికి అందజేశారు.కార్యక్రమంలో కామ నాగరాజు, మహమూద్, సత్యనారాయణ కోరి, పల్లి సుజాత, వీరభద్రం, గడ్డం వెంకన్న, కోటమ్మ, నీలరాణి, రాజు, హుస్సేన్, భవాని, వెంకటేశ్వర్లు, ఎస్తేరు, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు నిరసన..



**కరకగూడెం, జూలై 1(పీపుల్స్ డైరీ) :** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏఐఏడబ్ల్యూయూ , సీఐటీయూ, ఏఐకేఎస్ ఆధ్వర్యంలో నాయకులు కరకగూడెం మండలంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు రైతు సంఘం ఎస్ఎఫ్ఐ నాయకులు మాదాసు అఖిల్ పద్దం గణేష్ లు మాట్లాడుతూ, ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ.600 కనీస వేతనం అమలు చేయాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మరింత బలోపేతం చేసి పనిదినాలను పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే వ్యవసాయానికి ఎరువుల సబ్సిడీలను పునరుద్ధరించి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రైతులు, వ్యవసాయ కార్మికుల సంక్షేమానికి అనుకూలంగా తక్షణ చర్యలు చేపట్టాలని, లేకుంటే ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఏడబ్ల్యూయూ, సీఐటీయూ, ఏఐకేఎస్ నాయకులు, రైతులు, వ్యవసాయ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా వైద్యుల దినోత్సవం

**ఏన్కూరు, జులై 1 (పీపుల్స్ డైరీ) :** ప్రపంచ వైద్యుల దినోత్సవాన్ని ఖమ్మం జిల్లా ఏన్కూర్ లో ఘనంగా నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి బాలకృష్ణ ను సిబ్బంది సత్కరించారు.టియల్ పేట గుడ్ న్యూస్ ఉన్నత పాఠశాలలో వైద్యులను సత్కరించి వారి సేవలు కొనియాడారు. కార్యక్రమంలో సిస్టర్ జోస్లీ అమల ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది దుర్గాప్రసాద్, రమణ, జయకుమారి, గోపాలకృష్ణ, వీరన్న, రామ్ చందర్, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.





## చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

### రిమాండ్‌కు తరలింపు - 32 లక్షల విలువ చేసే 32 తులాల బంగారు ఆభరణాలు రికవరీ



**ఖమ్మం, జులై 1 (పీపుల్స్ డైరీ) :** గత కొన్ని నెలలుగా రాత్రి పూట తాళం వేసిన ఇళ్ళను లక్ష్యంగా చేసుకొని వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు టౌన్ ఏసీపీ రమణమూర్తి తెలిపారు. మంగళవారం సాయంత్రం నగరంలోని కిన్నెర హోటల్ ఎదురుగా వున్న పెట్రోల్ బంక్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న ఖమ్మం టూ టౌన్, సిసిఎస్ పోలీసులకు అనుమానస్పదంగా కనిపించిన ఆత్కూరు గ్రామం, మధిర మండలం, ఖమ్మం జిల్లా సెంట్రింగ్ వర్కర్ అయిన నిందితుడు కంబంపాటి ఏసోబుఏ కందుల సురేష్ రెడ్డి, 45సం ను అదుపులోకి తీసుకొని విచారించగా గత కొంతకాలంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాల్లో తాళాలు వేసి ఉన్న ఇళ్ళల్లో దొంగతనాలు చేసి, పలుసార్లు జైలు శిక్షలు అనుభవించాడని ,ఇతనిపై గతంలో 22 దొంగతనాల కేసులలో నిందితుడుగా ఉన్నట్లు తెలిపారు. నిందితుడు నుండి 32 లక్షల విలువ చేసే 32 తులాల బంగారు ఆభరణాలు, 40 వేల రూపాయల విలువ చేసే వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకునట్లు తెలిపారు. గత సంవత్సరం నుండి వివిధ పోలీస్ స్టేషన్ ల పరిధిలో చేసిన దొంగతనాల వివరాల ప్రకారం...1) ఖమ్మం 2వ టౌన్-4 2)ఖానాపురం హవేలీ -3 3)వేంసూరు-1,4) విఎం బంజర-1, 5)చిల్లకల్లు-1, 6)తిరువూరు-1ల్లో దొంగతనాలు చేశాడని ఏసీపీ తెలిపారు. సమావేశంలో ఇన్స్పెక్టర్లు, కరుణాకర్, బాలకృష్ణ, భానుప్రకాష్, ఎస్సై రమేష్ పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **KONDAPARTHI KIRAN,** PRINTED AT RATNA GRAPHICS, 2-3-703/7, THIRUMALA NAGAR COLONY, OPP : POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013, PUBLISHED AT H.NO. 3-4-396, NEW RAYAPURA, HANAMKONDA, WARANGAL, TELANGANA - 506001.
**EDITOR : KONDAPARTHI KIRAN.RNI NO: TEL/TEL/2009/28544, CELL:9493019044,** e-mail : peoplesdairydaily@gmail.com